# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :45 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 06-04-2024 | పేజీలు:4 వెల: 2.00


## పవన్ కార్యకర్తలను కలుసుకోరు

కాకినాడ,జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం మండిపడ్డారు. కార్యకర్తలను ఆయన దగ్గరకు కూడా రానివ్వడని చెప్పారు. పవన్‌కు కార్యకర్తలు వచ్చి షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదని.. వారిని అడ్డుకునేందుకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున జీతాలిచ్చి బౌన్సర్లను పెట్టుకున్నారని తెలిపారు. రోజుకు మూడు షిఫ్టుల్లో ఆ బౌన్సర్లు పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ముట్టుకోకూడదని.. షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదనే పవన్ కల్యాణ్.. బ్లేడ్‌బ్యాచ్ వచ్చేస్తోందంటూ పవన్ నెపం వేయడం హాస్యాస్పదంగా ఉందని ఆరోపించారు. ప్రజల దగ్గరకు రాలేనప్పుడు పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలు ఎందుకని ప్రశ్నించారు. తామంతా ప్రజల్లోనే తిరుగుతున్నాం కాదా.. తమపై బ్లేడ్ బ్యాచ్ దాడులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పిరికితనం, చేతకానితనంతోనే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయని విమర్శించారు. కార్యకర్తలను దగ్గరకు కూడా రానివ్వడని చెప్పారు. పవన్ చుట్టూ రోజుకు మూడు షిఫ్టుల్లో బౌన్సర్లు పనిచేస్తున్నారని తెలిపారు. చుట్టూ బౌన్సర్లను పెట్టుకున్న పవన్ కళ్యాణ్.. బ్లేడ్ బ్యాచ్ అంటూ వ్యాఖ్యలు చేయడం

## వయనాడ్‌లో రాహుల్ గాంధీని ఓడించేందుకు బీజేపీ వ్యూహాలు



న్యూఢిల్లీ, రాహుల్ గాంధీని టార్గెట్ చేసింది బీజేపీ. కేరళలోని వయనాడ్ నుంచి పోటీ చేస్తున్న రాహుల్‌పై అస్త్రశస్త్రలు ఉపయోగించేందుకు రెడీ అయింది. గత ఎన్నికల్లో అమేథీ, వయనాడ్ నుంచి పోటీ చేసి వయనాడ్‌లో మాత్రమే గెలిచారు రాహుల్. దీంతో ఈసారి అమేథీని వదిలేసి వయనాడ్ బరిలో మాత్రమే ఉన్నారాయన. వయనాడ్‌లో రాహుల్‌కు పోటీగా కేరళ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రన్‌ను బరిలోకి దింగడంతో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది.రెండో దశ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 26న కేరళలో వయనాడ్ స్థానానికి పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నామినేషన్ వేసిన 24 గంటల తర్వాత బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ తరపున రాహుల్ గాంధీ, సీపీఐ అభ్యర్థిగా డి.రాజా భార్య అన్నీ రాజా పోటీ చేస్తున్నారు. బీజేపీ తరపున రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్‌ను అభ్యర్థిగా బరిలోకి దిగారు.రాహుల్ గాంధీ ఇప్పటికే వయనాడ్ నుంచి నామినేషన్ వేశారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ కూడా అట్టహాసంగా ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. సురేంద్రన్ నామినేషన్ ర్యాలీకి కేంద్రమంత్రి స్మృతి ఇరానీ హాజరయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ స్థానం నుంచి రాహుల్ గాంధీపై స్మృతి ఇరానీ విజయం సాధించారు.

వయనాడ్ ర్యాలీలో రాహుల్‌ను టార్గెట్ చేశారు స్మృతి ఇరానీ. గాంధీ కుటుంబం 50 ఏళ్లు పాలించిన ప్రాంతం నుంచి వచ్చానంటూ ప్రసంగించారు. పీఎఫ్ఐ వంటి నిషేధిత సంస్థల నుంచి రాహుల్ గాంధీ సహాయం తీసుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు స్మృతి ఇరానీ.మరోవైపు వయనాడ్‌లో హైవోల్టేజ్ ప్రచారానికి ప్లాన్ చేస్తోంది బీజేపీ. నామినేషన్ల కార్యక్రమం అయిపోవడంతో బీజేపీ అగ్రనేతలతో క్యాంపెయిన్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ట్రయాంగిల్ ఫైట్‌లో రాహుల్‌ను ఓడించాలని భావిస్తోంది. అభ్యర్థి ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకుంది బీజేపీ. సురేంద్రన్ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడే కాదు.. ఆయనకు ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన పేరుంది. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం కోసం 15 ఏళ్లు పోరాడారు సురేంద్రన్.బీజేపీ సర్వశక్తులు ఒడ్డేందుకు ప్రయత్నిస్తుంటే.. సిట్టింగ్ సీటులో మళ్లీ గెలిచి పరువు నిలబెట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు రాహుల్. గత ఎన్నికల్లో పోలైన ఓట్లలో 64శాతం ఓట్లు సాధించారు. ఈసారి ఆయనకు అంతకు మించి మెజార్టీ వస్తుందని అంచనా వేస్తోంది కాంగ్రెస్.

## మద్యం పాలసీలో బీజేపీ హస్తం..

న్యూఢిల్లీ,ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై కుట్ర జరుగుతుందని.. ఇందులో బీజేపీ బడా నాయకుల ప్రమేయం ఉందని ఆప్‌నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. మద్యం పాలసీ కేసులో ఇటీవల సుప్రీంకోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. దాంతో ఆయన బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ సీఎంను అరెస్టు చేసేందుకు ఎలా కుట్ర జరిగిందో చెప్పేందుకే మీడియా ముందుకు వచ్చానన్నారు. మద్యం కుంభకోణం బీజేపీ చేసిందని.. ఇందులో ఆ పార్టీ సినియర్ నేతల హస్తం ఉ ందని ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మాగుంట శ్రీనివాసులు అనే వ్యక్తి మూడు వాంగ్మూలాలను ఇచ్చాడు. ఆయన తనయుడు రాఘవ్ ఏడు స్టేట్‌మెంట్లు ఇచ్చాడు. సెప్టెంబర్ 16న అరవింద్ కేజ్రీవాల్ మీకు తెలుసా? అని ఈడీ మొదటిసారి మాగుంట శ్రీనివాసులును ప్రశ్నించింది. సమయంలో ఆయన నిజమే చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్‌ను చారిటబుల్ ట్రస్ట్ భూ విషయంలో కలిసినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆయన కొడుకు రాఘవ్‌ను అరెస్ట్ చేసి ఐదు నెలల పాటు జైలులో ఉంచితే.. మాగుంట మాట మార్చాడు. సెప్టెంబర్ 16న మాగుంటపై తొలిసారిగా చర్యలు తీసుకున్నారు. ఫిబ్రవరి 10 వరకు కేజ్రీవాల్‌పై స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరింది. ఆ తర్వాత ఆయన కుమారుడిని అరెస్టు చేశారు. మాగుంట రాఘవ్ వాంగ్మూలం ఏడుసార్లు తీసుకున్నారు. ఆరింట్లో అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఏం మాట్లాడలేదు. జులై 16న ఏడో స్టేట్‌మెంట్ అతను తన స్టాండ్‌ని మార్చుకొని కుట్రలో



భాగమయ్యాడు.ఐదు నెలల టార్చర్ తర్వాత అతని మారిపోయాడు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చాడు' అని తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే.. ఆ ఆరు స్టేట్‌మెంట్‌లు (రాఘవ్).. అతని తండ్రి రెండు స్టేట్‌మెంట్‌లను తొలగించారు. అరవింద్‌కు వ్యతిరేకంగా లేని, అరవింద్ కేజ్రీవాల్ పేరు ప్రస్తావించని వాంగ్మూలాలను విశ్వసించబోమని ఈడీ పేర్కొంది. తండ్రీకొడుకులపై ఒత్తిడి తెచ్చి అరవింద్ కేజ్రీవాల్‌పై స్టేట్‌మెంట్లు తీసుకున్నారు' అని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీని మాగుంట శ్రీనివాసులు కలిసిన ఫొటోలున్నాయని.. జులై 16న కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇవ్వడంతోనే జులై 18న బెయిల్ మంజూరైందని.. ఇదో పెద్ద కుట్ర అంటూ సంజయ్ సింగ్ ఆరోపించారు.

## మోడీ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు కాలేదు

న్యూఢిల్లీ,ఏప్రిల్5: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోడీ గత పదేళ్లలో ఏనాడు వ్యవసాయరంగ అభివృద్ధి గురించి చర్చించలేదు. సాగునీటి తరలింపు, ధాన్యం దిగుబుల పెంపు, ధాన్యం కొనుగోళ్లు, దిగుమతులపై ఆంక్షల విషయంలో స్పష్టమైన విధానం అవలంబించడం లేదు. రైతులు కడుపుమండి రోడ్డెక్కితే మాత్రం లాఠీలతో అణచివేయించారు. నల్ల చట్టాలను వెనక్కు తీసుకోవాలని, ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలని రైతన్నలు దేశం నడిబొడ్డున రోడ్డు ఎక్కితే వారిని తీవ్రవాదులనీ, దేశద్రోహులనీ అవమానించి, పిట్టల్లా కాల్చి చంపిన ఘటనలు మరవలేం. రైతు ఆందోళనల సమయంలో కనీసం 500 మంది రైతులు చనిపోయారని గణాంకాలు ఘోషిస్తున్నాయి. రైతులు ఆందోళన చేస్తుంటే మాట్లాడకుండా దాటవేయడం, వారు ప్రేరేపిత ఆందోళను చేస్తున్నారని చెప్పడం సరికాదు. ఢిల్లీలో వారిని అడ్డుకునేందుకు ముళ్ల కంచెలు వేయాల్సిన అసవరం లేకుండా చేయలేకపోయారు. మద్దతు ధరలు దక్కుతాయన్న భరోసా కల్పించలేదు. యూపీఏ హయాంలో ఉన్న నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనగా 2016లో కేందప్రభుత్వం మార్చింది. అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2016 నుంచి 2020 వరకూ ఈ స్కీమ్‌ను రాష్ట్రంలో అమలు చేసింది. ఆ తర్వాత అమలు చేయడం ఆపేసినా, బీజేపీ ఎందుకు ప్రశ్నించలేదో, అప్పుడే ఎందుకు సత్యాగ్రహ దీక్షలు చేయలేదో ఆ పార్టీ నాయకులు రైతులకు సమాధానం చెప్పాలి. కరువు నష్టం కూడా అంతే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుగా ఒకరిపై ఒకరు నెపం వేసుకొని కాలం గడుపుతూ అన్నదాతను మోసం చేసారు. పండిన పంటకు మద్దతు ధరలు దక్కడం లేదు. నోట్ల రద్దు మొదలు జిఎస్టీ, సాగుచట్టాలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు, కార్పొరేట్లకు ఊడిగం, కరోనా కష్టాల్లో ఆర్థిక మందగమనం వంటి అనేకానేక చర్యల కారణంగా దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. బిజెపిలో తన మాటకు ఎదురులేకుండా చేసుకున్న మోడీ నిర్ణయాల కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడి పోతున్నారు. అయినా ఇవేవీ ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. చాయ్‌వాలాను అంటూ ప్రజలను నమ్మించి గొంతు కోసిన నేతగా ప్రజల ముందు నిలిచారు. బిజెపికి ఉన్న మంచి అనే ముసుగును వేసుకున్న నియంతగా మోడీ అవతరించారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారు. కొత్త వ్యవసాయ బిల్లులు ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం దేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్న చిత్తశుద్ధిని ఏమాత్రం ప్రదర్శించలేదు. సరికదా



ఆందోళన చేస్తున్న అన్నదాతల గురించి పట్టించుకోలేదు. కనీసం వారి మాటలకు విలువ ఇవ్వలేదు. కార్పేరేట్ రంగాన్ని సంతృప్తి పరిచి వారికి నూతనావకాశాలు కల్పించాలన్న లక్ష్యం తప్ప ఎక్కడా రైతులు వారి ప్రయోజనాల గురించి మాట్లాడలేదు. వ్యవసాయాన్ని పండగచేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామన్న మాటలు సాగుచట్టాలతో బూటకమని తేలిపోయింది. ప్రజల ఉద్యమంలో కొట్టుకుపోతామన్న భయంతోనే వాటిని రద్దు చేశారని భావించాలి. సాగుచట్టాలు రైతుల భవిష్యత్‌ను అంధకారంలో పడవేస్తాయని, కార్పొరేట్ల దయా దాక్షిణ్యాలపై వారు ఆధారపడే పరిస్థితి కల్పిస్తాయని వ్యవసాయరంగ నిపుణులు హెచ్చరించినా పట్టించు కోలేదు. రైతుల జీవితాల్లో సమూల మార్పులు తీసుకువచ్చి నిజంగా వారి ఆదాయాన్ని రెట్టింపు చేస్తాయని భావించి ఉంటే వాటిపై విస్తృతంగా చర్చించేవారు. ఈ చట్టాలు ఎలా మంచి చేస్తాయో చెప్పలేదు. సాగుచట్టాలు తెచ్చే ముందు చట్టాలపై రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడడం కానీ, వారి అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకోవడం కానీ చేయలేదు. ఈ బిల్లులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం దేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్న చిత్తశుద్ధిని ప్రదర్శించ లేదని తేలిపో యింది. కార్పేరేట్ రంగాన్ని సంతృప్తి పరిచి వారికి నూతనావకాశాలు కల్పించాలన్న ప్రేమను మాత్రమే ప్రకటించింది. తన వైఫల్యాల నుంచి చేతులు దులుపుకునే ప్రయత్నంలో భాగంగా మోడీ సాగుచట్టాలను రద్దు చేశారు. రైతులు సాధించిన అతిపెద్ద విజయంగా ఇది భారతదేశ చరిత్రలో నిలిచిపోతుంది. అయినా రైతుల గురించి నేటికీ చర్చించడం లేదు. ఎలా చేస్తే వ్యవసాయరంగం గట్టెక్కుతుందో ఆలోచనచేయడం లేదు.

## సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్



న్యూఢిల్లీ, సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. న్యాయ్‌పత్ర-2024తో పేరుతో 48 పేజీలతో ఈ మేనిఫెస్టోను రిలీజ్ చేశారు. 5 న్యాయ పథకాలు, 25 గ్యారంటీలను మేనిఫెస్టోలో పొందుపరిచారు.ముఖ్యంగా నిరుద్యోగంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణనను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. శుక్రవారం ఉదయం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సోనియా గాంధీ, రాహుల్ , చిదంబరం, కేసీ వేణుగోపాల్ సహా తదితర అగ్రనేతలు హాజరయ్యారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలోని కీలక హామీలివే..!

-యువతకు 30 లక్షల ఉద్యోగాల కల్పన
-రూ.5 వేల కోట్లతో యువతకు స్టార్టప్ ఫండ్
-మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సాయం
-విద్యా రుణాల వడ్డీ రేటు తగ్గింపు
-విద్యార్థులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం
-అగ్నివీర్ స్కీమ్ రద్దు
- రైతులకు కనీస మద్దతు ధరపై హామీ
- బస్సు ప్రయాణంలో మహిళలకు రాయితీ
-సామాజిక ఆర్థిక సమానత్వం కోసం చర్యలు
-వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ మినహాయింపు
- రైల్వేల ప్రైవేటీకరణ నిలిపివేత
- రైల్వే ఛార్జీల తగ్గింపు, వృద్ధులకు టికెట్లలో రాయితీ
- దేశవ్యాప్తంగా 8 కోట్ల కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల పంపిణీ
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- దేశవ్యాప్తంగా కులగణన
-కులగణన తర్వాత రిజర్వేషన్ల పరిమితి పెంపునకు రాజ్యాంగ సవరణ
- 50 శాతం రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేత
-పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు వంటి హామీలను కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పొందుపరిచింది.

## హత్య రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే...

కడప : కడప లోక్ సభ ఎన్నికల్లో ఓ వైపు రాజశేఖరరెడ్డి బిడ్డ.. మరోవైపు వివేకాను హత్య చేయించిన అవినాశ్ రెడ్డి ఉన్నారని ఏపీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. హంతకులు చట్ట సభలకు వెళ్లకూడదనే తాను కడప ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పారు. . కడప జిల్లా కాశినాయన మండలం అమగంపల్లిలో ఆమె బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మం కోసం ఒకవైపు తాను డబ్బుతో అధికారాన్ని కొందామనుకునే వ్యక్తి మరోవైపు ఉన్నారని ఎవరిని గెలిపించాలనేది ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి జగన్ మళ్లీ టికెట్ ఇచ్చారని విమర్శించారు. హంతకులను కాపాడేందుకే జగన్ సీఎం పదవిని వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హత్యా రాజకీయాలకు ముగింపు పలకాలంటే జగన్, అవినాశ్ ను ఓడించాలని అన్నారు.

వైఎస్ఆర్ సంక్షేమ పథకాలు అద్భుతం

ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో అద్భుత పథకాలను తీసుకొచ్చారని షర్మిల అన్నారు. ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్ మెంట్, రుణమాఫీ వంటి ఎన్నో పథకాలను అమలు చేశారని కొనియాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీకి తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు వచ్చి ఉండేవని చెప్పారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాలేదని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ పై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఉంటే అన్నీ పూర్తయ్యేవని చెప్పారు.

షర్మిలను ప్రజలంతా దీవించండి ..సునీతా

వివేకానంద కుమార్తె సునీత ప్రసంగిస్తూ కడప నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న షర్మిలను ప్రజలంతా దీవించాలని కోరారు. తన తండ్రి వివేకాను చంపిన వాళ్లకు, షర్మిలకు మధ్య పోటీ జరుగుతోందని అన్నారు. తన తండ్రిని అత్యంత క్రూరంగా చంపేశారని హత్య చేసిన వాళ్లే మళ్లీ ఎంపీ బరిలో ఉన్నారని మండిపడ్డారు. రాజశేఖరరెడ్డి ఉంటే దీన్ని సహించేవారా? అని ప్రశ్నించారు. షర్మిలను ఎంపీ చేయాలనేది తన తండ్రి చివరి కోరిక అని చెప్పారు. తన



తండ్రి కోరిక నెరవేరాలంటే అవినాశ్ ను ఓడించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీలో మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి

మరోవైపు వైసీపీకి రాజీనామా చేసిన కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఆమె భర్త రామ్మోహన్ రావు కాంగ్రెస్ లో చేరారు. పార్టీ కండువా వేసి ఇద్దరినీ కాంగ్రెస్ లోకి షర్మిల ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ జగన్, వైసీపీ కోసం తాను ఎంతో కష్టపడ్డానని చెప్పారు. ఉత్తరాంధ్రలో పార్టీని నిలబెట్టిన తనను జగన్ పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ తమకు దేవుడితో సమానమని షర్మిల నాయకత్వంలో ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియంత జగన్ ను గద్దె దించాలని కడప ఎంపీగా షర్మిలను గెలిపించాలని అన్నారు.

### 25 లక్షల నకిలీ నోట్లు పట్టివేత

హైదరాబాద్,రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 25 లక్షల నకిలీ నోట్లను మహేశ్వరం ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల తరుణంలో ఇలా నకిలీ నోట్లు పట్టుబడడం కలకలం సృష్టించుతోంది. వాహనాలు తనిఖీ చేస్తుండగా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రూ. 25 లక్షల నకిలీనోట్లు దొరికాయి. వాటిని మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్నట్లు, నలుగురు నిందితులను అరెస్టు చేశారు.కాంగ్రెస్ పార్టీతో కరువు రాలేదని ప్రజలకు కూడా తెలుసన్నారు.

## అన్నామలై,కంగనా రనౌత్‌పై కేటీఆర్ సెటైర్లు



హైదరాబాద్, బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్.. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. తన గెలుపు కోసం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఎలక్షన్ కాంపెయిన్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో కంగన మాట్లాడుతూ.. "నాకు ఒక విషయం చెప్పండి, మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, భారతదేశ మొదటి ప్రధాని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఎక్కడికి వెళ్ళారు?" అంటూ కామెంట్ చేశారు. దీనిపై కేటీఆర్ సెటైర్ వేశారు."ఉత్తరాదికి చెందిన బీజేపీ ఒకరు అభ్యర్థి సుభాష్ చంద్రబోస్ మా మొదటి ప్రధాని అని చెప్పారు!! దక్షిణాదికి చెందిన మరొక బీజేపీ నాయకుడు మహాత్మా గాంధీ మా ప్రధాని అని చెప్పారు!! వీళ్లంతా ఎక్కడ నుంచి పట్టభద్రులయ్యారు?" అంటూ కేటీఆర్ తన ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ పెట్టారు. మహాత్మా గాంధీ ప్రధాని అంటూ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.కాగా, ఇంతకుముందు కంగనా రనౌత్‌పై వ్యాఖ్యలు చేసి విమర్శలపాలైన యూపీకి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా ఛైర్మన్ సుప్రియ శ్రీనాథే.. కూడా తాజాగా స్పందించారు. "ఆమెను తేలికగా తీసుకోకండి ఆమె బీజేపీ నాయకుల జాబితాలో ముందుకు సాగుతున్నారు" అంటూ సెటైర్ వేశారు.నోటికి వచ్చింది మాట్లాడి వివాదాల్లో చిక్కుకోవడం కంగనా రనౌత్‌కు కొత్తేం కాదు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా ఎన్నికైన తర్వాతే మన దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని వ్యాఖ్యానించి గతంలో విమర్శలకు గురయ్యారు. మోదీ అండదండలతో బీజేపీలో చేరి తాజాగా ఎంపీ బరిలో నిలిచారు. కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో నాలుగు ఎంపీ స్థానాలకు జూన్ 1న ఒకే దశలో పోలింగ్ జరగనుంది.

### స్టీఫెన్ రవీంద్రపై డిఎస్పీ ఫిర్యాదు

హైదరాబాద్,సైబరాబాద్ మాజీ సీపీ, ప్రస్తుత హోంగార్డ్స్ ఐజీ స్టీఫెన్ రవీంద్రపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కమాండ్ కంట్రోల్ డీఎస్పీ గంగాధర్ ఫిర్యాదు చేశారు. తాను నార్సింగి సీఐగా ఉన్నప్పుడు భూ వివాదంలో జోక్యం చేసుకున్నానని ఆరోపిస్తూ రవీంద్ర సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. భూ కబ్జాదారులతో చేయి కలిపి, ఎలాంటి విచారణ చేయకుండానే తనను సస్పెండ్ చేశారన్నారు.

## సంపాదకీయం

**శనివారం 06-04-2024**

# పదేండ్ల ట్రైలర్..!

మోడీ 'వికసిత్ భారత్' పర్యటన మూడు రోజుల కిందట ఉత్తరప్రదేశ్ చేరుకుంది. మీరట్‌లో జరిగిన సభలో 'ఇప్పటి వరకు దేశ ప్రజలు చూసిన అభివృద్ధి కేవలం ట్రైలరే. రాబోయే ఐదేండ్లలో మొత్తం సినిమా చూపిస్తా' అంటూ వ్యాఖ్యానించారు. మరో సారి అధికారం ఇస్తే ఈ పదేండ్లలో సాధించిన దానికంటే దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా చేస్తానని ఇంకాస్త విపులంగా చెప్పుకొచ్చారు. దాని కోసం తన ప్రభుత్వం ఓ రోడ్ మ్యాప్ కూడా సిద్ధం చేసుకుందని చెప్పారు. ఈ పదేండ్ల ట్రైలర్‌కే సామన్యులు విలవిల్లాడుతున్నారు. విద్వేష విధ్వంసమూ సాగుతోంది. ఇక సినిమా మొత్తం చూపిస్తే ఏమవుతుందో ఆందోళన కలిగించే అంశమే.మోడీ వెలగబెట్టిన ఈ పదేండ్ల పాలనలో ప్రజల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందనేది పచ్చినిజం. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి పూట కూడా గడవని స్థితికి ప్రజలు చేరుకున్నారని, పేదరికాన్ని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారని చెబుతున్న లెక్కలు సత్యం. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తానంటూ యువతను బుట్టలో వేసుకున్న మోడీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు కూడా ఊడబీకారనేది వాస్తవం. ఒకే దేశం ఒకే పన్ను అంటూ జీఎస్టీ తెచ్చి సామాన్యులపై మోయలేని భారం మోపారు. అలాగే నల్లధనాన్ని రూపుమాడమే తన లక్ష్యంగా చెప్పుకుంటూ పెద్ద నోట్లను హడావుడిగా రద్దు చేసి కార్పొరేట్లకు లాభం చేకూర్చారు. ఇదే విషయాన్ని నిన్నకాక మొన్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న కూడా గుర్తుచేశారు. గవర్నర్లను ఉపయోగించుకొని రాష్ట్రాల హక్కులను కాలరాయచూశారు. ప్రతిపక్ష సభ్యులకు ఎరవేసి ప్రభుత్వాలనూ మార్చేసారు. తమ మతోన్మాద విధానాలను యథేచ్ఛగా అమలు చేసుకునేందుకు రాజ్యాంగాన్నే తిరగరాస్తామంటున్నారు. ఇదంతా ఈ పదేండ్ల ట్రైలర్‌లో మోడీ సాధించిన ఘన చరిత్ర కాదా!ఇక తనది రైతు రాజ్యమంటూ గొప్పలు చెబుతూ వ్యవసాయరంగంలో కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ పరిచేందుకు మూడు నల్ల చట్టాలను తెచ్చిన మోడీ మోసాన్ని కర్షకులు ఎప్పటికీ మర్చిపోరు. వాటికి వ్యతిరేకంగా ఉద్యమించిన రైతుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న గొప్ప చరిత్రా ఈ ట్రయలర్ కాలంలోదే. అన్నదాతల పోరాట పటిమకు చివరకు దిగిరాక తప్పలేదు. అలాగే కార్మిక చట్టాలను కాలరాస్తూ నిర్ణయాలు తీసుకుంటే వారూ తిరగబడ్డారు. నూతన విద్యావిధానం తెచ్చి పేదలకు విద్యను దూరం చేసే కుట్రలు పన్నితే విద్యార్థులు ఎలా మర్చిపోతారు?'బేటీ బచావో – బేటీ పడావో' నినాదం మన ప్రధానికి కొట్టిన పిండైపోయింది. అయితే చిన్నారి ఆసిఫాపై లైంగిక దాడికి పాల్పడిన దుర్మార్గులకు ఆయన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలే అండగా నిలిచిన విషయం మహిళా లోకం ఇంకా మర్చిపోలేదు. దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన రెజ్లర్లు నడిరోడ్డుపై బోరున విలపించిన దృశ్యం ఇంకా ప్రజల కండ్లల్లో మెదులుతూనే ఉంది. బిల్కిస్ బానోపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన నేరస్తులను స్వేచ్ఛగా వదిలేస్తే కోర్టు మొట్టికాయలు వేసిన సంగతి దేశం ఎలా మర్చిపోతుంది? ఇవన్నీ మోడీ ట్రైలర్‌లో జరిగిన దుర్మార్గాలు కాదా..! ఇక మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసిన ఘటనను ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. ఇవన్నీ ఆయనగారి పదేండ్ల ట్రైలర్ పాలనలో జరిగిన నీచమైన చర్యలే కదా!కార్మికులు, కర్షకులు, మహిళలు, యువత, విద్యార్థులు ఇలా అందరూ గత పదేండ్ల నుంచి పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా లౌకిక రాజ్యమని చెప్పుకుంటున్న మన దేశంలో మైనార్టీలు అభద్రతా భావంలో బతుకుతున్నారు. దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షు అన్నట్టు కాలం వెళ్లదీస్తున్నారు. మతం ఆధారంగా పౌరసత్వాన్ని రుజువు చేసుకొమ్మంటున్నారు. ట్రైలర్‌లోనే తమ బతుకులు ఇలా ఉంటే ఇక మొత్తం సినిమా మొదలైతే తమ పరిస్థితి ఇంకెంతగా దిగజారి పోతుందో అనే సందేహం రావడం సహజం.ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో మోడీ గుండెల్లో గుబులు మొదలైంది. తన దుర్మార్గపు ట్రైలర్ పాలన నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు ఎత్తులు వేస్తున్నారు. ప్రతిపక్ష నేతలు అవినీతికి పాల్పడ్డారంటూ దాడులకు తెగబడ్డారు. ఈడిని అడ్డుపెట్టుకొని తన ప్రతాపాన్ని చూపిస్తున్నారు. తనకు అడ్డు లేకుండా చేసుకునేందుకు ప్రతిపక్ష నేతలను జైళ్ళకు పంపిస్తున్నారు. అవినీతికి పాల్పడింది ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకునేం దుకు తన ప్రభుత్వం వెనకాడే ప్రసక్తే లేదని ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. మరి ఆ అవినీతిపరులే తన కమలం గూటికి చేరితే మాత్రం విచిత్రంగా శుద్ధపూసలైపోతున్నారు. అందుకే మోడీ ట్రైలర్ పాలనలో జరిగిన పాపాల చిట్టాను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే తాము స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునే హక్కును కూడా కోల్పోతామనే నిజాన్ని గ్రహిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో మోడీని ఓడించి అసలు ప్రజా సినిమా చూపించేందుకు ఓటర్లు సిద్ధమవుతున్నారు.

# అందరిచూపు చీపురుపల్లిపైనే..బొత్సను ఢీకొంటున్న కళా



విజయనగరం,అందరి చూపు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం పైనే ఉంది. ఇక్కడ మంత్రి బొత్స సత్యనారాయణ పోటీలో ఉండడం, ఆయనకు టిడిపి మాజీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు పోటీ నివ్వడంతో రసవత్తరంగా మారింది.ఒకరు సీనియర్ పొలిటిషియన్, ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలను శాసించిన నేత. మరొకరు పాలిటిక్స్‌లో సీనియర్ కావడంతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడుగా పనిచేసిన అనుభవం ఉన్నవారు. వీరిద్దరి మధ్య పోరు జిల్లాలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లోనూ ఆసక్తిగానే మారింది. అక్కడ అధికార, ప్రతిపక్షాలకు ఎవరి ఓటు బ్యాంక్ వారికుంటుంది. ఎవరి రాజకీయాలూ వారివే. హాట్‌హాట్‌గా రాజకీయాలు సాగుతున్న ఆ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల పోరు మరింత రసవత్తరంగా మారనుంది. చీపురుపల్లి రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న నియోజకవర్గం. ఇక్కడ మొదటి నుండి టీడీపీ, వైసీపీ నువ్వా ? నేనా అన్నట్లు ఉంటాయి. పోటీలో ఎవరు ఉన్నా పార్టీ ఓటు బ్యాంక్ మాత్రం ఏ పార్టీ ఓటు బ్యాంక్ ఆ పార్టీకి పదిలంగా ఉంటుంది. ఇక్కడ అధికార వైసీపీ నుండి సీనియర్ పొలిటీషియన్, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుండి ఈయన మూడోసారి ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో బలమైన నేత. 1999 లో ఎంపీగా ఎన్నికైన బొత్స, ఆ తరువాత 2004లో చీపురుపల్లి నుండి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అప్పటినుండి ఈ నియోజకవర్గాన్ని తనకు పెట్టనికోటగా మార్చుకున్నారు. బొత్స 2004లో ఇక్కడ నుండి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత నుండి తన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకుంటూ, తనకంటూ ఒక బలమైన సొంత ఓటు బ్యాంకును క్రియేట్ చేసుకోగలిగారు.ఇక ఇక్కడ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నుండి మాజీ మంత్రి, మాజీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు బరిలో దిగుతున్నారు. 1983 లో టీడీపీ నుండి తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన కిమిడి కళా వెంకట్రావు శ్రీకాకుళం జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. ఉనుకూరు, ఎచ్చెర్ల నియోజకవర్గాల నుండి ఇప్పటివరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా, టీటీడీ చైర్మన్‌గా పనిచేశారు. ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లా నుండి రాజకీయాలు నెరపిన కళా వెంకట్రావు తొలిసారి విజయనగరం జిల్లా చీపురుపల్లి నుండి బొత్స సత్యనారాయణపై బరిలో దిగనున్నారు. ఇద్దరు రాజకీయ ఉద్దండులు పోటీకి దిగడం ఇప్పుడు ఆసక్తిగా మారింది. అయితే ఇక్కడ వైసీపీ నుండి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్‌పి ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను ఈ నియోజకవర్గం నుండే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్‌గా చిన్న శ్రీను కొనసాగుతున్నారు. చిన్న శ్రీను ప్రధానంగా ఈ నియోజకవర్గం పైనే ఫోకస్ పెడుతుంటాడు.. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సర్వీస్ ఇస్తుంటాడు. నియోజక వర్గంలో ఏ కార్యకలాపాలు అయినా ఈయన ముందుండి నడిపిస్తాడు. చిన్న శ్రీను నియోజకవర్గంపై బాగా గ్రిప్ ఉన్న నేత. అలాగే ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కూడా స్థానికుడు కావడం, గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి నేతల వరకు మంచి సంబంధాలు ఉండటం వైసీపీకి కలిసొస్తున్న మరో అంశం.. అలా స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి బొత్స, ఎంపీ బెల్లాన, జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను ముగ్గురు నియోజకవర్గ క్యాడర్‌ను ఏకతాటిపై నడిపిస్తూ వైసీపీకి ఇక్కడ కంచుకోటగా మార్చారు..రెండు లక్షల మంది ఓటర్లు ఉండే ఈ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో కాపు సామాజికవర్గానికి చెందిన వారు ఉంటారు. ఇక్కడ అభ్యర్థుల గెలుపోటములు ఈ సామాజికవర్గ ఓటర్లే నిర్దేశిస్తారు. అయితే ఇక్కడ నుండి పోటీ చేసే అభ్యర్థులు ఇరువురు కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో కులాల ప్రస్తావన అంతగా రాదనే చెప్పాలి. అంతేకాకుండా ఈ నియోజకవర్గం ఆవిర్భావం నుండి టీడీపీకి కంచుకోట. పటిష్టమైన ఓటు బ్యాంక్ కలిగిన పార్టీగా చెప్పుకోవచ్చు. 1994, 1999లో ఇక్కడ నుండి కుల బలం లేని కమ్మ సామాజికవర్గానికి చెందిన గద్దె బాబురావు గెలిచారు. అలాగే, 2004, 2009 లో బొత్స చేతిలో గద్దె బాబురావు స్వల్ప మెజారిటీతోనే ఓటమి పాలయ్యారు. అయితే 2004 తరువాత బొత్స చీపురుపల్లి నియోజకవర్గంలో తన హవా పెంచుకుంటూ వస్తున్నారు. రాష్ట్ర మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడుగా ఉండగా నియోజకవర్గంలో ఓ వైపు చిన్న శ్రీను, మరోవైపు బొత్స సతీమణి బొత్స ఝాన్సీ ఎంపిగా నియోజక వర్గానికి విస్తృత సేవలు అందించారు.. 2014 నాటికి రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ తుడిచిపెట్టుకు పోతే కాంగ్రెస్ నుండి చీపురుపల్లిలో పోటీ చేసిన బొత్సకు సుమారు నలభై రెండు వేల పైచిలుకు ఓట్లు సాధించి రికార్డు సృష్టించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుండి బొత్స, వైసీపీ నుండి బెల్లాన చంద్రశేఖర్, టీడీపీ నుండి కిమిడి మృణాళిని పోటీ చేయగా ముక్కోణపు పోటీలో టీడీపీ అభ్యర్థి మృణాళిని గెలిచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 2019లో బొత్స వైసీపీ నుండి పోటీ చేయగా కిమిడి మృణాళిని కుమారుడు కిమిడి నాగార్జున టీడీపీ నుండి పోటీ చేసి బొత్స చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో చీపురుపల్లికి చెందిన ఎంపి అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ కూడా కావడంతో వైసీపీ ఓట్లు చీలకపోవడంతో పాటు అంతా ఏకతాటిపై నడిచి ఎన్నికలు చేయడంతో బొత్స గెలుపు నల్లేరు మీద నడక అయ్యింది.. అయితే ఇప్పుడు మరోసారి మంత్రి బొత్స సత్యనారాయణ ఎన్నికల బరిలో ఉండగా టీడీపీ నుండి కొత్తగా కిమిడి కళా వెంకట్రావు బరిలో ఉన్నారు. అయితే ఇక్కడ టీడీపీ ఇంచార్జిగా కిమిడి నాగార్జున కొనసాగుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కిమిడి నాగార్జునకు టిక్కెట్ దక్కలేదు. 2019 ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన కిమిడి నాగార్జున అప్పటి నుండి నియోజకవర్గంలోనే ఉంటూ స్థానిక క్యాడర్‌తో పాటు ప్రజలతో మమేకమై రాజకీయాలు చేశారు. అయితే ఆఖరి క్షణంలో కిమిడి నాగార్జునను ప్రక్కనబెట్టి కళా వెంకట్రావుకు టిక్కెట్ ఇచ్చింది అధిష్టానం. దీంతో కిమిడి నాగార్జున తీవ్ర మనస్తాపంతో ఉన్నారు. పలు ఆందోళనలు, నిరసనల రూపంలో తెలియజేశారు. నాగార్జునకు టిక్కెట్ ఇవ్వాలని క్యాడర్ సైతం పట్టుబట్టింది. నాగార్జున కూడా అంతే స్థాయిలో పార్టీపై, కిమిడి కళా వెంకటరావుపై విరుచుకుపడుతున్నారు. తమ సొంత పెద నాన్న అయినా వెనక్కి తగ్గేది లేదని హెచ్చరిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చీపురుపల్లి నుండి ఇద్దరు రాజకీయ ఉద్దండులు పోటీచేస్తున్న నేపధ్యంలో ఈ నియోజకవర్గం పైనే ఇప్పుడు అందరి చూపులు ఉన్నాయని చెప్పాలి..

# సాగునీటి నిర్వహణలో సర్కారు తికమక..



హైదరాబాద్, రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ ఎంత అస్తవ్యస్తంగా తయారైంది? అన్న ప్రశ్నకు సుందిళ్ల పరిణామమే పెద్ద ఉదాహరణ. అసలు బరాజ్‌లోని నీటిని ఎందుకు ఖాళీ చేయాలనుకున్నారనేది ఎవరికీ అంతుబట్టడం లేదు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఆదేశానుసారమే బరాజ్‌ను ఖాళీ చేశారని ఒక వాదన వినిపిస్తున్నప్పటికీ అసలు అథారిటీ ఇంజినీర్లు ఎప్పుడు చెప్పారు? అనేది ఒక ప్రశ్న. మేడిగడ్డ ఘటనపై కమిటీ ఏర్పాటైన తర్వాత గత నెల 6న తొలిసారిగా కమిటీ చైర్మన్, సభ్యులు తెలంగాణకు వచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌లను పరిశీలించి, వెళ్లారు. ఒకవేళ అప్పుడే బరాజ్‌లను ఖాళీ చేయాలని ఆదేశించి ఉంటే, నిన్నటిదాకా ఎందుకు నీటిని వదల్లేదనేది ఇంకో ప్రశ్న.రెండో దఫాగా కమిటీ గత నెల 19-21 తేదీల్లో హైదరాబాద్‌కు వచ్చి జలసౌధలో విచారణ చేపట్టింది. కానీ ఆ సందర్భంగా బరాజ్‌లను ఖాళీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు లేదు. అలాంటి ఆదేశాలు వచ్చినట్టు ఇంజినీర్లు కూడా చెప్పలేదు. సరే! కమిటీ ఆదేశించింది అనుకున్నా.. వారం పాటు గేట్లు ఎత్తకుండా, 28వ తేదీనే ఎందుకు ఎత్తారు? అనేది మరో ప్రశ్న. వాస్తవానికి ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చేదాకా కాళేశ్వరం మోటర్లు నడిపే ప్రసక్తే లేదని ప్రభుత్వం భీష్మించుకొని కూర్చున్నది. తాము ఇంజినీర్లు కాదు.. నిపుణుల సూచన మేరకే నడుచుకుంటామని సీఎం రేవంత్ సహా మంత్రులు చెప్తూ వచ్చారు. ఒకవేళ ఎన్డీఎస్ఏ కమిటీ ఆదేశాల ప్రకారమే నీటిని విడుదల చేస్తే.. ప్రజాప్రతినిధి ఫోన్ చేయగానే ఎందుకు నీటి విడుదల ఆపేసినట్టు? అన్నది అసలైన ప్రశ్న. ఇన్ని అనుమానాల మధ్య రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ ఇంజినీర్ల ప్రణాళిక ప్రకారం అమలవుతున్నదా? లేక మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్‌కాల్స్‌పై గేట్లు తెరవడం, మూయడం జరుగుతున్నదా? అన్న కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అనంతగిరి.. అంతులేని విషాదం

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి రిజర్వాయర్ కింది ఆయకట్టు రైతుల్లో ఈ ఏడాది అంతులేని విషాదం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో వేల ఎకరాల్లో పంట నష్టపోయిన దుస్థితి. అనంతగిరి రిజర్వాయర్‌కు అల్లీపూర్, అనంతారం వైపుగా రెండు ఫ్రీ ఫ్లో గేట్లు ఉన్నాయి. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3.5 టీఎంసీలు. రిజర్వాయర్ పూర్తిగా నిండిన సమయంలో ఆ ఫ్రీ ఫ్లో గేట్ల ద్వారా దిగువన ఒకవైపు రేపాక పెద్దచెరువు, మరోవైపు అనంతారం చెరువు అక్కడి నుంచి రహీంఖాన్‌పేట చెరువు ఇలా గొలుసుకట్టు చెరువులకు నీళ్లు వదిలేవారు. అదేవిధంగా బిక్కవాగులోకి నీటిని వదిలిపెట్టేవారు. తద్వారా వాగు చుట్టుపక్కల ఉన్న 10 గ్రామాల్లో, గొలుసు కట్టు చెరువుల కింద వేల ఎకరాల్లో పంటలు సాగయ్యేవి.కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుంచి దాదాపు ఐదేండ్లుగా రెండు పంటలకు పూర్తి భరోసా లభించింది. కానీ ఈ ఏడాది కాళేశ్వరం ఎత్తిపోతలు లేవంటూ సర్కారు చెరువులను నింపలేదు. కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి మధ్యమానేరులో 18 టీఎంసీలకుపైగా నీళ్లు ఉన్నాయి. అన్నపూర్ణ పంప్‌హౌజ్‌లో కూడా 2.5 టీఎంసీల జలాలు ఉన్నాయి. మధ్యమానేరు జలాశయం నుంచి అదనంగా 1 టీఎంసీని ఎత్తిపోస్తే ఫ్రీ ఫ్లో గేట్లు పనిచేసేవి. కొద్ది మొత్తంలో నీటిని విడుదల చేసి చెరువులను నింపితే ఇప్పుడు అక్కడ పంటలు ఎండిపోవాల్సిన దుస్థితి వచ్చేది కాదు. కానీ ప్రభుత్వం ఆ పనిచేయలేదు. అన్నపూర్ణలో ఉన్న జలాలను రంగనాయకసాగర్‌కు తరలించింది. వెరసి ఇప్పుడు అన్నపూర్ణలో 0.87 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక మధ్యమానేరులో ఇప్పుడు 7.7 టీఎంసీల జలాలు ఉండగా, అందులో ఎస్సారెస్పీ ఆయకట్టు కోసం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం అవగాహనరాహిత్యంతో అనంతగిరి కింది ఆయకట్టు ఎండిపోతున్న దుస్థితి.

ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణలేమి

ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణపైనా ప్రభుత్వానికి అవగాహన లేదని తెలిసిపోతున్నది. వాస్తవంగా ఎస్సారెస్పీ స్టేజ్ 1, స్టేజ్ 2 కింద దాదాపు 13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నది. ఎస్సారెస్పీ కాలువల కింద కాకుండా ఆ కమాండ్ ఏరియాలో భూగర్భ జలాల ఆధారంగా అదనంగా 5 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుంది. మొత్తంగా 20 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు సాగు అయ్యేది. కాల్వలకు వాటి సామర్థ్యం మేరకు సమృద్ధిగా నీరు అందించినపుడే కమాండ్ ఏరియాలో భూగర్భ జలాలు నిలకడగా ఉండి పంటలు సాగయ్యే అవకాశం ఉంటుంది. అదేవిధంగా కాలువల కింది ఆయకట్టుకు సైతం పుష్కలంగా నీరందే పరిస్థితి ఉంటుంది.కాళేశ్వరం అందుబాటులోకి వచ్చాక ఈ 20 లక్షల ఆయకట్టుకు పూర్తి భరోసా లభించింది. కానీ ఈ ఏడాది ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిలిపేయడంతో ఆయకట్టు మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన అనంతరం ఎస్సారెస్పీ నీటిని ఎల్ఎండీ ఎగువకే పరిమితం చేశారు. ఎల్ఎండీ దిగువకు కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన జలాలనే తరలించేవారు. దాంతో నీటి కొరత ఉండేది కాదు. చివరి మడికి సైతం తడి తాకింది. కాంగ్రెస్ సర్కారు మాత్రం కాళేశ్వరం ఘనతను చిన్నగా చూపాలన్న ప్రయత్నంలో కాళేశ్వరం లేకున్నా ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సైతం నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చింది.కానీ ఆచరణలో మాత్రం బొక్కబోర్లా పడింది. కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి ఎల్ఎండీ, ఎస్సారెస్పీ, ఎంఎండీలో కలిపి 100 టీఎంసీలకు పైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఆ నీళ్లను ఎంత పొదుపుగా వాడుకున్నా గరిష్ఠంగా 12 లక్షలకు మించి ఆయకట్టుకు ఇవ్వలేమన్నది అధికారుల మాట. అయినా నిజాలు దాచి స్టేజ్-2 కూడా ఇస్తున్నామని చెప్పి పెన్‌పహాడ్ వరకు నీటిని విడుదల చేసింది. అయితే నీటి పొదుపు పేరుతో కాల్వలకు నిర్దేశిత సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేయకపోవటంతో రైతులు ఎక్కడికక్కడ మోటర్లు పెట్టి తోడేయటం, ఎవరు ఒత్తిడి చేస్తే వారికి నీటిని విడుదల చేయడంతో సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు ట్రాన్స్‌మిషన్ నష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. కమాండ్ ఏరియాలో భూగర్భ జలమట్టం పెరిగింది లేదు. వెరసి ఎస్సారెస్పీ ఆయకట్టులో 5 లక్షలకు మించి ఎకరాలు ఎండిపోయే దుస్థితి తలెత్తింది.ఈ సమయంలో కూడా లక్ష్మీ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి 1470 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నది. కొన్ని ఇసుక బస్తాలు అడ్డువేసో, చిన్న మట్టికట్టవేసో ఈ

# పెరిగిపోతున్న కష్టాలు...!

అమరావతి, కూటమికి కష్టాలు అలా పెరిగిపోతున్నాయి. 2014 నాటి మ్యాజిక్ రిపీట్ అనుకుంటూ కూటమి కట్టారు కానీ 2024 నాటి పరిస్థితులు వేరుగా మారుతున్నాయి. ఆనాడు బీజేపీ పూర్తిగా సహకరించింది. జనసేన అయితే ఔట్ రైట్ గా బయట నుంచి మద్దతు ఇచ్చింది. దాంతో పొత్తు పేచీలు ఏవీ లేకుండా కథ సుఖాంతం అయింది. ఏపీ మీద నాడు బీజేపీ కేంద్ర నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వచ్చారు. ప్రధాని అభ్యర్థిగా ఉన్న నరేంద్ర మోడీ కూటమికి ఆక్సిజన్ గా నిలిచారు. ఇలా మిత్రుల పూర్తి సహకారంతో కూటమికి ఎన్నికల ముందే అధికారం కళ కొట్టొచ్చినట్లుగా కనిపించింది. కానీ ఈసారి మాత్రం అంతా ఉల్టా సీదా గా సాగుతోంది అని అంటున్నారు. కూటమి ఏర్పాటు ఆలస్యంగా సాగింది. మనసులు కలవని మనువుగా ఈ కూటమి ఉందని అంటున్నారు. కూటమికి పెద్దన్న ఎవరు అన్నది తెలియడం లేదు. ఎవరికి వారు యమునా తీరేగా పరిస్థితి ఉంది. నాడు చంద్రబాబు పూర్తిగా కూటమికి సారధ్యం వహించారు. వ్యూహాలు అన్నీ ఆయనే చూసుకునేవారు. అందరూ నాడు బాబు మాట వినేవారు. ఇపుడు సొంత పార్టీలో కూడా రెబెల్స్ తయారై చంద్రబాబుని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇక మిత్రుల కథ సరేసరి. ఇచ్చిన సీట్లలో అసంతృప్తులు ఉన్నాయంటున్నారు. అదే సమయంలో ఆయా పార్టీలలో ఉన్న వర్గ పోరు కూడా కూటమికి సెగ పెంచేస్తోంది. ఏపీలో ఎన్నికలు ఈసారి మే 13న ఉన్నాయి. అంటే నాలుగవ దశ అన్న మాట. ఈ దశ అయితే కూటమికే అతి పెద్ద అడ్వాంటేజ్ కావాల్సినంత సమయం ఉంది అని మొదట్లో భావించారు. కానీ చూడబోతే ఆ ఎక్కువ సమయమే కూటమికి మిక్కిలి కష్టాలు తెచ్చిపెడుతోంది అని అంటున్నారు. కాలం ఎక్కువ అయ్యే కొద్దీ రోజులు గడిచే కొద్దీ కూటమిలో సర్దుబాట్లు కుదరకపోగా అవి మరింతగా ఎక్కువ అవుతున్నాయి. ఎంతదాకా అంటే ఇంకా టైం ఉంది కదా ఫలానా చోట అభ్యర్థిని మార్చండి అని సొంత పార్టీ నుంచి ధిక్కార స్వరాలు వినిపిస్తూంటే మిత్రులు కూడా అదే డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ అయితే ఎంపీ సీట్ల విషయంలో మళ్లీ మార్పులు చేయమంటోంది. విశాఖ ఎంపీ సీటు ఆ పార్టీ కోరుకుంటోంది. అలాగే ఎమ్మెల్యే సీట్లలో తమకు నచ్చిన చోట ఇమ్మని కోరుతోంది.జనసేన విషయం చూస్తే ఆ పార్టీ తలనొప్పులు ఇంకా ఎక్కువగా ఉన్నాయి. అవన్నీ కలసి కూటమి మీదనే ప్రభావం చూపిస్తున్నాయి. అందరికీ సర్దిచెప్పుకునే బాధ్యత టీడీపీ మీదనే పడుతోంది. టీడీపీకి ఈసారి ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా ఉన్నాయి. దానికి తోడు కూటమిలో కలహాలు వర్గ పోరు సమస్యలు అన్నీ నెత్తిన పడుతున్నాయి. పోలింగ్ కి సరిగ్గా నలభై రోజులు మాత్రమే సమయం ఉన్నా ఇంకా కూటమిలో బాలరిష్టాలు తీరడం లేదు. ఉమ్మడిగా ఒకే ఒక సభ నిర్వహించారు. అది చిలకూరిపేటలో. ఆ తరువాత ఎవరి మానాన వారు ఉన్నారు. జనసేన ఇంకా ప్రచారం మొదలెట్టలేదు. పవన్ పిఠాపురానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. బీజేపీ అయితే ఇంకా సీట్ల పంచాయతీ దగ్గరే ఆగిపోయింది. మండు టెండలో చంద్రబాబు ఒక్కరే ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి ఎన్నికల ప్రణాళిక ఇంకా సిద్ధం చేయలేదు. మూడు పార్టీల నేతలతో కూటమి ప్రచారానికి వేగవంతం చేయాలనుకుంటే అది ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. ఈలోగా వాలంటీర్ల వివాదం కూడా బూమరాంగ్ అయ్యేలా ఉంది. మరో వైపు చూస్తే వైసీపీలో అభ్యర్థుల మీద నిరసనలు వచ్చినా ఎక్కడా మార్చే ప్రసక్తి లేదని ఆ పార్టీ చెప్పేసింది. టీడీపీలో మాత్రం అభ్యర్థుల మార్పు కోసం అంతా ఒత్తిడి పెడుతున్నారు. ఇలాగైతే ఎప్పటికి కథ తెమిలేను అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా కూటమికి కష్టాలు అంతకంతకు పెరిగిపోతున్నాయని అంటున్నారు.

# వదినపై పోటీ చేయనున్న మాజీ సీఎం!

రాంచీ,జేఎంఎంకు కంచుకోటగా ఉన్న, పార్టీ చీఫ్ శిబు సోరేన్ ఎనిమిది సార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన జార?ండ్‌లోని దుంకా లోక్‌సభ స్థానాన్ని ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకొనేందుకు ఆ పార్టీ కృతనిశ్చయంతో ఉన్న ది. 2004 నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టిన శిబు సోరేన్.. 20 19 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోవడంతో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమ పార్టీ విజయాన్ని కొనసాగించేందు కు బీజేపీ ఈసారి పక్కా వ్యూహంతో శి బు సోరేన్ పెద్ద కోడలు సీతా సోరేన్‌ను త మ పార్టీలో చేర్చుకొని దుంకా నుంచి బరిలోకి దింపింది. దీంతో తమ పార్టీ కంచుకోటను నిలబెట్టుకొనేందుకు దుంకా నుంచి తన వదినపై మాజీ సీఎం హేమంత్ సోరేన్ పోటీచేస్తారనే ప్రచారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. దీనిపై రాష్ట్ర సీఎం, జేఎంఎం కీలక నేత చంప యీ సోరేన్ స్పందిస్తూ.. దీనిపై పార్టీ త్వ రలో నిర్ణయం తీసుకొంటుదన్నారు.

తోడికోడళ్ల మధ్య పొలిటికల్ హీట్

మరోవైపు హేమంత్ సోరేన్ అరెస్టు తర్వా త జార?ండ్ రాజకీయాల్లో ముఖ్యంగా సోరేన్ కుటుంబంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకొన్నాయి. శిబు సోరేన్ కుమారుడు, దివంగత దుర్గా సోరేన్ భా ర్య సీతా సోరేన్ గత నెల బీజేపీలో చేరా రు. ఆ వెంటనే కమలం పార్టీ సిట్టింగ్ ఎం పీని పక్కన పెట్టి మరీ ఆమెకు దుంకా లో క్‌సభ టికెట్ కేటాయించింది. హేమంత్ అరెస్టు తర్వాత ఆయన భార్య కల్పన జే ఎంఎం పార్టీలో క్రియాశీలంగా మారారు. ఇటీవల సీతా సోరేన్ బీజేపీలో చేరిన స మయంలో వీరిద్దరు పరస్పర విమర్శల తో రాష్ట్ర రాజకీయాలను మరింత హీటెక్కించారు. జమా స్థానం నుంచి జేఎం ఎం ఎమ్మెల్యేగా ఉన్న సీత బీజేపీలో చేరడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కల్ప న సోరేన్.. మోకరిల్లడం అనేది జార?ండ్‌కు చెందిన వాళ్ల డీఎన్ఏలో లేదంటూ పోస్టు పెట్టారు. దీనికి సీత సోరేన్ కూడా ఘాటుగా స్పందించారు. తన భర్త పేరు తో మొసలి కన్నీరు కార్చడం ఆపాలని కౌంటర్ ఇచ్చారు. తాను, తన పిల్లలు నిజాలను వెల్లడిస్తే, కొంత మంది రాజకీ య కలలు కల్లలు అవుతాయన్నారు.

# రూ.34 కోట్లు విలువ చేసే నగదు, ఆభరణాలు స్వాధీనం

అమరావతి,రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ. 34 కోట్లు విలువ చేసే నగదు, ఆభరణాలు ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర పరిస్థితుల్ని ఆయన మీడియాకు వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత తనిఖీల్లో రూ. 11 కోట్ల నగదు, రూ. 7కోట్లు విలువైన మద్యం, రూ. 10 కోట్లు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను సీజ్ చేశాం. నగదు, మద్యం, వాహనాల స్వాధీనానికి సంబంధించి 3,300 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సి-విజిల్ యాప్‌ద్వారా ఇప్పటి వరకు 5,500 ఫిర్యాదులు అందాయి. ఎన్నికలకు సంబంధించి 3,040 ఫిర్యాదులను పరిష్కరించాం. నియమావళి ఉల్లంఘిస్తూ ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలపై 1,600, ఎన్నికల కోడ్ ఉన్నా ప్రచారం చేస్తున్న ఘటనలపై 107, అనుమతి లేకుండా ప్రచారంలో వాహనాల వాడకంపై 43, మతపరమైన ప్రచారాలపై 28, నగదు పంపిణీపై 29, మద్యం పంపిణీపై 17 ఫిర్యాదులు వచ్చాయి'అని ముకేశ్ కుమార్ మీనా తెలిపారు.

# ఇపుడెందుకు...

న్యూఢిల్లీ,ఎందుకంటే వారి పాలించిన కాలంలో పుట్టని వారు ఈ రోజు ఉన్నారు. వారే ఓటర్లుగా ఉంటున్నారు. వారే రేపటి పాలకులను నిర్ణయిస్తారు ఎక్కడి నెహ్రూ ఎక్కడి ఇందిరాగాంధీ వా రి పేరు చెప్పుకుని కాంగ్రెస్ పార్టీయే రాజకీయం చేయడం లేదు అలాంటిది దశాబ్దాల వెనక జరిగిన వాటిని ఇపుడు చెబుతూ బీజేపీ నెహ్రూ గాంధీ వంశీకుల మీద నిప్పులు చెరగడం పట్ల విమర్శలు వస్తున్నాయి. / నెహ్రూ మరణించి అక్షరాల ఆరు దశాబ్దాలు దాటింది. ఇందిరాగాంధీ మరణించి నాలుగు దశాబ్దాలు దాటింది. రాజీవ్ గాంధీ చనిపోయిన మూడున్నర దశాబ్దాలు దాటింది. వారి మీద వారి పాలన మీద ఇపుడు విమర్శలు చేయడం తగునా అన్నది మేధావుల నుంచి సగటు జనాల నుంచి వస్తున్న ప్రశ్న. ఎందుకంటే వారి పాలించిన కాలంలో పుట్టని వారు ఈ రోజు ఉన్నారు. వారే ఓటర్లుగా ఉంటున్నారు. వారే రేపటి పాలకులను నిర్ణయిస్తారు. ఇక చరిత్ర పుస్తకాలు తిరగేసేందుకు బోర్ కొట్టే యువతరం నేడు ఉంది. సరే చరిత్రలో మంచి ఉంది చెడ్డ ఉంది. పొరపాట్లు జరగకుండా ఎక్కడా ఉండదు, కానీ ఆనాటి తప్పులనే పదే పదే చెబుతూ పబ్బం గడుపుకోవడం బీజేపీకి తగునా అని అంటున్నారు నెటిజన్లు. వారు సోషల్ మీడియాలో బీజేపీని ఈ విధంగా ఏకేస్తున్నారు. దానికి కారణం బీజేపీ ఎంతసేపూ నెహ్రూ ఆ తప్పులు చేశారు ఇందిరాగాంధీ ఈ తప్పులు చేశారు అని ఎత్తి చూపుతుండడం. తాజాగా కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ గుజరాత్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సదస్సులో మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని నెహ్రూ విదేశాంగ విధానంలో చేసిన తప్పులను వరసగా ఏకరువు పెట్టారు. ఆనాడు ఐక్య రాజ్య సమితి భారతి కి శాశ్వత సభ్యత్వం ఇస్తాను అంటే ముందు చైనా అని నెహ్రూ ఆ దేశం పేరుని ప్రతిపాదించారని, అదే బీజేపీ అయితే భారత్ కే మొదటి ప్రాధాన్యత కోరేదని ఆయన అన్నారు. అంతే కాదు చైనా వల్ల భారత్ కి సరిహద్దు సమస్యలు ఇబ్బందులు వస్తాయని నాటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చెప్పినా నెహ్రూ వినకుండా చైనాతో దోస్తీ చేసారని దాని ఫలితంగా సరిహద్దులలో సమస్యలు ఇపుడు వస్తున్నాయని ఆయన అంటున్నారు. అంతే కాదు కాశ్మీర్ సమస్య ఆ విధంగా పుట్టిందే అని అంటున్నారు. నెహ్రూ చాలా విషయాల్లో వేసిన తప్పులను ఈనాడు దేశం అనుభవిస్తోందని ఆయన విమర్శించారు. అసలు కాశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్య సమితి ముందుకు నెహ్రూ తీసుకుని వెళ్లడమే తప్పు అని జై శంకర్ అన్నారు. నెహ్రూ విధానాల వల్లనే ఇపుడు చైనా సరిహద్దులలో రెచ్చిపోతోందని ఆయన అంటూ గత పదేళ్ల బీజేపీ ఏలుబడిలో ఇవన్నీ వారసత్వంగా వచ్చిన సమస్యలుగా చెప్పారు.సరే ఈ సమస్యలకు బీజేపీ ఏమి పరిష్కారం చూపించింది అన్నది ఆయన చెప్పకుండా నెహ్రూని ఆయన విధానాలను ఇపుడు తప్పు పట్టడం వల్ల ఉపయోగం ఏంటి అనంది సోషల్ మీడియాలో చర్చగా సాగుతోంది. మాట్లాడితే కాంగ్రెస్ ని గత చరిత్రను చెప్పవద్దు నెహ్రూ పేరు ఇందిరాగాంధీ పేరు చెప్పవద్దు అంటూ సుద్దులు చెప్పే బీజేపీ తాను మాత్రం వారిని విమర్శించడానికి అవే పేర్లను ప్రస్తావించవచ్చా అని నెటిజన్లు అంటున్నారు. బీజేపీకి యాంటీ నెహ్రూ యాంటీ ఇందిరా పాలసీ అయితే అయి ఉండవచ్చు. కానీ ఈ జనరేషన్ కి వారు ఏమి చేశారు అన్న దాని కంటే బీజేపీ పదేళ్లలో ఏమి చేసింది అన్నదే ప్రధానం అంటున్నారు. ఆ సంగతిని పక్కన పెట్టి కాంగ్రెస్ పెద్దలను విమర్శిస్తూ బీజేపీ మీద సానుభూతి పుడుతుందా అని ప్రశ్నిస్తున్నారు. ఈనాటి తరం చాలా చురుకుగా ఆలోచిస్తుంది అన్నది బీజేపీ పెద్దలు కానీ కేంద్ర మంత్రులు కానీ మరచిపోతే ఎలా అని అంటున్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో చైనా మీద ఏ రకంగా వత్తిడి పెంచి సరిహద్దులను కాపాడారు అన్నది విడమరచి చెప్పాలని అంటున్నారు. అలాగే ఫ్యూచర్ లో భారత్ ఇబ్బందులు పడకుండా ఏ విధానం అనుసరించ బోతున్నారు అన్నది చెప్పాలని అంటున్నారు. బీజేపీ ఎంతసేపూ గాంధీ నెహ్రూలను విమర్శిస్తూ గతాన్ని తవ్వి తీస్తూ పబ్బం గడుపు కోవాలంటే కుదురుతుందా అని సూటిగానే ప్రశ్నిస్తున్నారు. మరి ఈ విషయంలో బీజేపీ తన తీరుని మార్చుకోవాలనే అంతా అంటున్నారు. లేని పక్షంలో ఎంతసేపూ ఫ్లాష్ బ్యాక్ కథలు చెబుతూ బీజేపీ కూడా గతంలోనే ఉండిపోయే ప్రమాదం పొంచి ఉందని కూడా హెచ్చరిస్తున్నారు.

# కాంగ్రెస్ కక్ష

హైదరాబాద్,నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కక్ష కట్టిందని, ఎందుకింత కక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా?... కార్మికులు రోడ్డున పడ్డా కనికరించరా?.. అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల తరువాత సమైక్యరాష్ట్రం నాటి సంక్షోభం తెలంగాణలో ఏర్పడిందని అన్నారు. నేతన్నల బతుకులు ఆగం అయ్యేలా కాంగ్రెస్ విధానాలు ఉన్నాయని, నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్డర్లు అపేసిందని మండిపడ్డారు. గతంలో మాదిరిగా నేతన్నలకు చేతినిండా అర్డర్లు వేంటనే ఇవ్వాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని.. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అవసరం అయితే మరింత సాయం చేయాలని సూచించారు. కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతో నేతన్నల పొట్ట కొట్టడం సరైంది కాదన్నారు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరమని, వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ సర్కార్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ అన్నారు. ఈ పదేండ్లలో నేతన్నలకు చేతి నిండా పని కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమైక్య రాష్ట్రంలో నాటి సంక్షోభం నెలకొందని ఆయన పేర్కొన్నారు. నేతన్నలకు ఆర్డర్లు ఆపడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మాదిరే నేతన్నలకు చేతి నిండా పని కల్పించాలని కోరారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలి. అవసరమైతే మరింత సాయం చేసి ఆదుకోవాలన్నారు. కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతో నేతన్నల పొట్ట కొట్టడం సరైంది కాదు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరం. వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు పండుగలా కళకళలాడిన చేనేతరంగం.. మీ కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాగులునెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. మీ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతోపాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయి. చేనేత కార్మికులు, పవర్ లూమ్ ఆసాములతోపాటు

# అవసరమెంతో అనుమానమంత

న్యూఢిల్లీ,బిజెపికి ప్రత్యామ్నాయంగా ఒక రాజకీయ వేదిక అవసరం ఈ రోజున దేశానికి ఎంతున్నదో, అటువంటి వేదిక అంటూ ఏర్పడిన 'ఇండియా' కూటమి పట్ల అనుమానాలు కూడా అంతున్నాయి. ఈ కూటమి అధికారానికి రాగలిగినన్ని స్థానాలు గెలవగలదా అన్నది మొదటి అనుమానమైతే, ఆ ప్రభుత్వం స్థిరంగా ఉండగలదా అనేది రెండవది. అయితే, వారి విధానాలు దేశాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంత వరకు తోడ్పడగలవన్న మూడవ అనుమానంగా ముందుకొస్తున్నాయి. మొన్న మార్చి 31 న ఢిల్లీలో జరిగిన సభ తర్వాత కూడా ఈ సందేహాలు తీరటం లేదు.బిజెపి అనండి, ఎన్‌డిఎ అనండి వారు ఇప్పటికి రెండు సార్లు మంచి మెజారిటీలతో అధికారానికి వచ్చి పూర్తి కాలం సుస్థిరంగా పాలించారు. స్వంత బలంతో లేదా సామదానభేదోపాయాలతో అత్యధిక రాష్ట్రాలను పాలిస్తున్నారు. ఇపుడు మరొక మారు లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా కూడా అంతే బలంగా కనిపిస్తున్నారు. మరి ఎందుకు ప్రత్యామ్నాయం అవసరమని అనుకోవడం ఎందుకు? ఈ ప్రభుత్వం బలహీనంగా ఉందని, స్థిరంగా లేదని కాదు. సమస్య విధానాలకు సంబంధించినది. ప్రధాని మోడీ ప్రభుత్వం ఆర్థిక రంగంలో, విదేశాంగ రంగంలో, సంక్షేమ రంగంలో, అభివృద్ధి రంగం లో సాధించినవి కొన్నున్నాయని చెప్తారు. అది పూర్తిగా కొట్టివేయదగినది కాదు. ఆర్థికంగా స్థిరత్వం, కొంత పురోగతి ఉన్నాయి. సంక్షేమ రంగంలో ముఖ్యంగా తక్కిన దేశం కన్న వెనుకబడిన హిందీ రాష్ట్రాలలో పేద ప్రజలు మెచ్చే చర్యలు కొన్ని తీసుకున్నారు. మౌలిక వసతుల అభివృద్ధి కూడా అదే విధంగా జరిగింది. విదేశాంగ రంగంలో కొన్ని విషయాలలో భారత దేశం తన గౌరవాన్ని, ర్యాంకింగ్‌లను కోల్పోయినా, పాశ్చాత్య దేశాల ఆధిపత్యాన్ని తరచు ధిక్కరించి, దేశ ప్రయోజనాల కోసం నిలబడుతున్నది. వీటన్నింటిలోనూ చీకటి వెలుగులున్నాయి.మరొక వైపు చూస్తే, బిజెపికి ప్రత్యామ్నాయం తప్పక అవసరమనిపించే విషయాలు కొన్నున్నాయి. వాటిలో అన్నింటికన్న ముందు ఆలోచనలలోకి వచ్చేది బిజెపి మతతత్వ విధానాలు. బిజెపి మాతృ సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ గాని, దానితో పాటు సంఘ్ పరివార్ గాని భారత దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడం తమ లక్షమని ఎటువంటి దాపరికం లేకుండా ప్రకటించారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఏర్పడినందున బిజెపి ఆ మాట బహిరంగంగా అనటం సాధ్యం కాదు గనుక ఆ పని చేయలేదు గాని, ఆ పార్టీ విధానాలు, ప్రభుత్వ చర్యలు ఎటువంటి సందేహం లేని విధంగా అటువైపే దారి తీస్తున్నాయి. ఒకవేళ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ సంస్థలు సైద్ధాంతికంగా, మేధోపరంగా, శాంతియుతం గా ప్రజలను అందుకు ఒప్పించగలిగితే సమస్య ఉండదన్నది కొందరి అభిప్రాయం. అందువల్ల కొన్ని సమస్యలు ఉండకపోవచ్చు. ముఖ్యంగా శాంతి భద్రతల సమస్యలు. కాని అనేకానేక కుల మతాలు, జాతులు, భాషా సంస్కృతులు, భావజాలాలకు నిలయమైన ఈ సువిశాల దేశం లో భిన్నత్వంలో ఏకత్వమనేదే వాంఛనీయమవుతూ వస్తున్నది. ఏకత్వమే తప్ప భిన్నత్వానికి తావు లేదనడం తప్పకుండా తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది. ఆ విషయం బిజెపికి తెలియనిది కాదు. అయినప్పటికీ ఏమి చేసైనా సరే ఏకత్వాన్ని సాధించబూనడం, అందుకు మతం ఒక సాధనం కావడం ఈ దేశానికి ఏ విధంగా చూసినా వాంఛనీయం కాదు. అది దేశ సామాజిక, భౌగోళిక స్థిరత్వాలకు ముప్పు తేగలదు.బిజెపికి ప్రత్యామ్నాయం అవసరమని భావించటానికి ఇది ఒక ప్రధాన కారణం కాగా, ఆర్థిక విధానాలు రెండవ కారణం. ఆర్థిక రంగం ఒక కోణం నుంచి చూసినప్పుడు బలపడుతున్న మాట నిజం. కాని ఎప్పుడైనా పెరుగుదల (గ్రోత్), అభివృద్ధి (డెవలప్‌మెంట్) రెండు భిన్నమైన విషయాలు. ఉదాహరణకు ఈ రోజున భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు 10వ ర్యాంకు నుంచి 5వ ర్యాంకుకు ఎదిగింది. త్వరలో 3 వ ర్యాంకుకు చేరగలదని మోడీ ప్రభుత్వం చెప్తున్నది. కాని అభివృద్ధి లేదా మానవాభివృద్ధిపరంగా మన ర్యాంకు 2000 ల సంవత్సరంలో సుమారు 100 కాగా, ఇప్పుడు పదేళ్ళ మోడీ పాలన తర్వాత 134కు పతనమైంది. ఇందుకు అదనంగా, వ్యవసాయదారుల పరిస్థితి క్షీణించడం, నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరుగుదల, ధనిక పేద తారతమ్యాలు ఎన్నడూ లేని స్థాయికి చేరడం, దేశ సంపదలు అతి కొద్ది మంది వద్ద పోగుపడడం, ప్రకృతి వనరులను వారు యథేచ్ఛగా కొల్లగొట్టి విధ్వంసం చేయటం వంటివి బిజెపి అదుపు లేకుండా సాగుతున్నాయి. దీనినంతా వామపక్షాలతో సహా ప్రతి పక్షాలు సైతం




ప్రశ్నించలేకపోతున్నాయి. లేదా ప్రతిపక్షాలకు కూడా ఇందులో భాగస్వామ్యం ఉంటున్నది.బిజెపికి ప్రత్యామ్నాయం అవసరమనేందుకు పైన ప్రస్తావించినవి రెండు కారణాలు కాగా, ప్రజాస్వామిక విధివిధానాలకు భంగం వాటిల్లుతుండటమన్నది మూడవ ముఖ్య కారణం. పలు భంగపాట్లు లోగడ కాంగ్రెస్ ఏలుబడిలోనూ చోటు చేసుకున్నాయి. అదే విధంగా ప్రతిపక్ష రాష్ట్రాలలోనూ తరచు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆర్టికల్ 365 ను, గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగపరచడం, ఇతర పార్టీల సభ్యులను కొనుగోలు చేయడం, చట్టసభల స్పీకర్లు, ఎన్నికల కమిషన్, న్యాయస్థానాల వంటి రాజ్యాంగ వ్యవస్థలను అదుపులో పెట్టుకోవడం, ప్రతిపక్ష ప్రభుత్వాలను నిధుల కేటాయింపులో ఇబ్బంది పెట్టడం వంటివి. ఇటువంటి ధోరణులు మోడీ పాలనలో విచ్చలవిడిగా మారాయి. ఉదాహరణకు, అసెంబ్లీ ఎన్నికలలో తమకు ఆధిక్యత రాకపోయినా అవతలి పార్టీలను చీల్చడం, గవర్నర్ల ప్రయోగం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవడం ఈ పదేళ్లలో ఎన్ని సార్లు జరిగిందో ఎంత బాహాటంగా సాగిందో లెక్క కూడా లేదు. అయినా మోడీ వీలైన ప్రతిసారి ప్రజాస్వామ్యం గురించి గంభీరమైన ప్రవచనాలు చెప్తుంటారు.ఇది ఒకటి కాగా, ధన బలాన్ని ఉపయోగించడం పరాకాష్ఠకు చేరింది. ఆశ్రిత పెట్టుబడిదారీ ధనిక వర్గానికి అనుకూలమైన విధానాలు రూపొందించడం, వారు చూస్తుండగానే ప్రపంచ స్థాయి ధనవంతులు అవుతుండడం, వారి నుంచి మామూలు పద్ధతిలో, ఇతర వ్యాపార వర్గాల నుంచి బెదిరింపులతో, సిబిఐ, ఐటి, ఇడి వంటి సంస్థల ప్రయోగంతో వసూళ్ళు ఏ విధంగా సాగుతున్నాయనే దానికి ఎన్నికల బాండ్లు ఒక తిరుగులేని ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఇక పౌర హక్కులను, వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేయడమైతే ఇంచుమించుగా లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ నియంతృత్వాల స్థాయికి చేరింది. అందువల్లనే ప్రపంచ స్థాయి సంస్థలు మేధావుల నుంచి మోడీ ప్రభుత్వాన్ని "ఎన్నికైన నియంతృత్వ' మని అభివర్ణించడం, మన ప్రజాస్వామ్యాన్ని 105 వ ర్యాంకుకు దించివేయడం జరిగిపోయింది.ఇటువంటి వివిధ తీవ్రమైన కారణాల వల్ల బిజెపి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం ఒక తప్పనిసరి అవసరంగా మారింది. ఒకవేళ ఆ పార్టీ మూడవసారి కూడా అధికారానికి వచ్చినట్లయితే ఏమి జరగవచ్చునన్న ఆలోచనే పలువురిని భయపెడుతున్నది. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వాన గల 'ఇండియా' కూటమి గురించి ఊహించినప్పుడు పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లు కనిపిస్తున్నది. దేశంలో ప్రత్యామ్నాయ ఐక్య సంఘటనలన్నవి 1977లో జనతా పార్టీ తో మొదలయ్యాయి. తర్వాత 47 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంచ్‌ల నుంచి మొదలుకొని ప్రస్తుతపు 'ఇండియా' కూటమి వరకు పలు వేదికలు ఏర్పడినా ఏదీ స్థిరంగా లేక ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకోవటం ఒక సమస్య.స్వయంగా ఆ పార్టీల విధానాలు, వ్యవహారణలు, ప్రభుత్వ పాలనలు గొప్పగా ఏమీ లేకపోవడం, వారు సైతం అవినీతిపరులు కావడం మరొక సమస్య. ప్రస్తుత 'ఇండియా' కూటమిలోనూ ఇవే లక్షణాలు కనిపిస్తున్నాయి. నిరుడు జులైలో ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు ఆ పార్టీలు సరైన ఐక్యతను సాధించలేకపోయాయి. ఎన్నికలకు కొన్ని వారాల వ్యవధి మాత్రమే ఉండగా సీట్ల సర్దుబాట్లు పూర్తి చేసుకోలేకపోతున్నాయి. ఇంతే ముఖ్యంగా, అసలు వివిధ అంశాలపై తమ ఉమ్మడి విధానాలు ఏమిటో, అవి బిజెపికి ఏ విధంగా భిన్నమైనవో, ప్రజలకు గాని, దేశానికి గాని ఎట్లా మేలు చేస్తాయో వారు చెప్పడం లేదు. ప్రజలు దేనిని చూసి తమపై ఆశలు పెట్టుకోవాలి?

# బోణీ కొట్టేనా ?

తిరువనంతపురం,నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ రెండుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ దక్షిణాదిన మాత్రం ఆ పార్టీ విస్తరించలేకపోయింది. కర్ణాటక మినహా మిగతా దక్షిణాది రాష్ట్రాల రాజకీయాల్లో బీజేపీ పాత్ర పరిమితంగానే ఉన్నది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అయినా దక్షిణాదిన అన్ని రాష్ట్రాల్లో తామున్నామని నిరూపించుకునే దిశగా కమలం పార్టీ పావులు కదుపుతున్నది. ఇందులో భాగంగా 'దేవభూమి' కేరళపై ఆ పార్టీ చాలానే ఆశలు పెట్టుకున్నది. ఈ రాష్ట్రంలో ఇప్పటివరకూ ఒక్క లోక్‌సభ సీటునూ గెలవని బీజేపీ.. ఈసారి కనీసం ఐదు స్థానాల్లోనైనా నెగ్గాలని పట్టుదలగా ఉన్నది. మరోవైపు సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా కేరళలో మెజారిటీ స్థానాలను దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

### తగ్గిన బీజేపీ ఓట్ల శాతం

కేరళలో బీజేపీకి ఎన్నడూ ఆశించిన ఫలితాలు రాలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం 15.64 శాతం ఓట్లు సాధించి మూడోస్థానానికి పరిమితమైంది. ఒక్క తిరువనంతపురంలో రెండోస్థానంలో నిలవడం మినహా మిగతా అన్ని స్థానాల్లో మూడో స్థానానికే పరిమితమైంది. ఇక, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నో ఆశలు పెట్టుకొని బరిలో నిలిచి శక్తియుక్తులన్నీ ఒడ్డినా కూడా బీజేపీకి చేదు ఫలితాలే మిగిలాయి. పైగా 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఆ పార్టీ ఓట్లు 2.60 శాతం తగ్గిపోయి 12.36 శాతం ఓట్లకు పరిమితమైంది. 2016 ఎన్నికల్లో గెలిచిన ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గ్రాఫ్‌ను పెంచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఆ పార్టీ ఇంఛార్జిగా ఉన్న ప్రకాశ్ జవదేకర్ ఆరు నెలలుగా కేరళలోనే ఉండి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

### క్రైస్తవ ఓట్లపై గంపెడాశలు

కేరళలో ముస్లిం, క్రైస్తవ ఓట్లు దాదాపుగా 46 శాతం వరకు ఉంటాయి. ఈ ఓట్లు తమకు వ్యతిరేకంగా ఉండటమే మైనస్‌గా మారిందని భావిస్తున్న బీజేపీ ఈసారి క్రైస్తవ ఓట్లపై కన్నేసింది. క్రైస్తవుడైన కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఏకే ఆంటోని కుమారుడు అనిల్ ఆంటోనిని పార్టీలో చేర్చుకున్నది. ప్రముఖ క్రైస్తవ నేతగా ఉన్న పీసీ జార్జ్ నేతృత్వంలోని కేరళ జనపక్షం(సెక్యులర్) పార్టీని బీజేపీలో విలీనం చేసుకున్నది. గత ఏడాది ప్రధాని మోదీ కేరళకు వెళ్లినప్పుడు ప్రత్యేకంగా క్రైస్తవ పెద్దలతో సమావేశమయ్యారు. అయితే, క్రైస్తవుల ఓట్లను ఆకర్షించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు సీఏఏ, మణిపూర్ హింస గండి కొడుతున్నాయి. ఇటీవల గుడ్‌ఫ్రైడే సందర్భంగా పలువురు క్రైస్తవ బిషప్‌లు ఈ రెండు అంశాలను లేవనెత్తడం బీజేపీకి ఇబ్బందికరంగా మారింది.

### బలంగా ఆరెస్సెస్.. బలహీనంగా బీజేపీ

కేరళలో ఆరెస్సెస్ బలంగా ఉన్నప్పటికీ బీజేపీ మాత్రం రాజకీయంగా ఎదగలేదు. ఆరెస్సెస్ కూడా కేరళలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ కంటే ఎక్కువ శాఖలు ఉన్నాయని, ఈ చిన్న రాష్ట్రంలో దాదాపు 5,142 ఆరెస్సెస్ శాఖలు పని చేస్తున్నాయని చెప్తారు. అయినప్పటికీ రాజకీయంగా మాత్రం ఇది బీజేపీకి కలిసి రావడం లేదు. కేరళలో హిందువుల ఓట్లు దాదాపు 54 శాతం ఉన్నప్పటికీ వారిలో మెజారిటీ కాంగ్రెస్, కమ్యూనిస్టుల వైపే ఉంటూ వస్తున్నారు. దీంతో ఈసారి హిందూ ఓటుబ్యాంకును పెంచుకునేందుకు కూడా బీజేపీ ప్రయత్నిస్తున్నది. కేరళలో హిందువుల్లో దాదాపుగా 25 శాతం వరకు ఏజవ సామాజికవర్గం వారు ఉంటారు. వీరు సంప్రదాయంగా కమ్యూనిస్టు పార్టీల వైపు ఉన్నారు. వీరిని తమవైపు తిప్పుకునేందుకు గానూ.. ఈ వర్గానికి చెందిన శ్రీనారాయణ ధర్మ పరిపాలన సంస్థ నేతృత్వంలో నడిచే భారత్ ధర్మ జనసేన(బీడీజేఎస్)తో బీజేపీ పొత్తు కుదుర్చుకున్నది. అయితే, బీడీజేఎస్ ప్రభావం కూడా గత ఏ ఎన్నికల్లోనూ అంతగా కనిపించలేదు.

### మెజారిటీ సీట్లపై కాంగ్రెస్ ఆశలు

గత కొన్ని దశాబ్దాలుగా కేరళలో కేవలం సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి మధ్యే ఎన్నికల పోరు జరుగుతున్నది. ఈ రెండు పార్టీలూ జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ కేరళలో మాత్రం పరస్పరం తలపడుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ కూటముల మధ్య ద్విముఖ పోరు జరగగా యూడీఎఫ్ 19 సీట్లు గెలుచుకుంది. ఈసారి కాంగ్రెస్ ఎక్కువగా ఆశలు పెట్టుకున్న అతి కొన్ని రాష్ట్రాల్లో కేరళ ఒకటి. ఈసారి కూడా కేరళలో ద్విముఖ పోటీనే ఉంటుందని కాంగ్రెస్, సీపీఎం భావిస్తున్నాయి. బీజేపీ ప్రభావం కేవలం కొన్ని స్థానాల్లోనే నామమాత్రంగా ఉంటుందని కేరళ అసెంబ్లీ ప్రతిపక్ష నేత సతీశన్ అంటున్నారు.

### ఆరు స్థానాలపైనే బీజేపీ గురి

కేరళలో బీజేపీ ప్రధానంగా పాలక్కడ్, కాసర్‌గోడ్, త్రిస్సూర్, పతనంతిట్ట, తిరువనంతపురం, అత్తింగల్ స్థానాలపై కన్నేసింది. త్రిస్సూర్ నుంచి ప్రముఖ నటుడు సురేశ్ గోపిని, అత్తింగల్ నుంచి కేంద్రమంత్రి వీ మురళీధరన్‌ను, తిరువనంతపురం నుంచి మరో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను, పతనంతిట్ట నుంచి అనిల్ ఆంటోనీని బరిలోకి దింపింది. వీరి ఇమేజ్ కూడా కలిసొస్తుందని, కచ్చితంగా ఐదు స్థానాలను గెలుచుకుంటామని బీజేపీ చెప్తున్నది.

# త్రిపుల్‌ఆర్‌పై నీలినీడలు!

# రాయగిరి ప్రాంత రైతుల వ్యతిరేకతే కారణం



హైదరాబాద్,రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ప్రాంతంలో ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో ఈ అంశాన్ని పరిశీలించాలని ఇటీవల ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో కోర్టు సూచనల మేరకు అలైన్‌మెంట్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనుల కోసం త్వరలో టెండర్లు పిలిచేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ సానుకూల నిర్ణయం తీసుకుంటే ఈ ప్రాజెక్టు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి.భారత్ మాల పరియోజన తొలి దశలో భాగంగా ట్రిపుల్‌ఆర్‌లో 164 కి.మీ. పొడవైన ఉత్తర భాగాన్ని నిర్మించాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన 1,935.35 హెక్టార్లలో ఇప్పటికే 1,500 హెక్టార్ల (85 శాతం) భూసేకరణ పూర్తయింది. మిగిలిన 15% భూసేకరణ ప్రక్రియను 3 నెలల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు. కానీ, ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించిన డీపీఆర్ తయారైనప్పటి నుంచే రాయగిరి ప్రాంత రైతులు దీనికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిపై అప్పుడు స్థానిక ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా రైతులకు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం ఆయనే రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉండటంతో ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను సవరించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### టెండర్ల ప్రక్రియకు బ్రేకులు?

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ ఇప్పటికే ఖరారైనందున దాన్ని సవరించేందుకు అంతగా ఆస్కారం ఉండకపోవచ్చని అధికారులు అంటున్నారు. కానీ, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరిస్తే తేనతుట్టెను కదిపినట్టేనని, అలైన్‌మెంట్‌లో మార్పులు చేస్తే మరికొన్ని కొత్త డిమాండ్లు రావొచ్చని, రాయగిరి ప్రాంత రైతుల మాదిరిగా మిగిలిన చోట్ల కూడా వ్యతిరేకత వ్యక్తం కావొచ్చని అధికారులు చెప్తున్నారు.

ఇదే జరిగితే ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగం పనులపై కూడా ప్రభావం పడుతుందని, దీంతో ఈ ప్రాజెక్టు మరింత జాప్యమవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. కానీ, ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పునకు సాక్షాత్తూ రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రే మద్దతు తెలపడంతో టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడినట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కాదని కేంద్రం ముందుకెళ్తే ముమ్ముందు ఈ ప్రాజక్టు నిర్మాణంలో మరిన్ని సమస్యలు తలెత్తవచ్చని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్తున్నారు.

### అనేక పట్టణాల గుండా ట్రిపుల్‌ఆర్

ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి మొత్తంగా దాదాపు 4,942 ఎకరాల భూములను సేకరించాల్సి ఉన్నది. దీనికి రూ. 5,170 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా. ఇందులో సగభాగాన్ని (రూ.2,585 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉన్నది. మిగిలిన సగభాగంతోపాటు యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు అయ్యే రూ.363 కోట్ల ఖర్చును భరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ట్రిపుల్‌ఆర్ నిర్మాణాన్ని రెండు భాగాలుగా చేపట్టనున్నారు. ఇందులో 164 కి.మీ. పొడవైన ఉత్తర భాగాన్ని రూ.9,500 కోట్లతో నిర్మించాలని నిశ్చయించారు. ఈ భాగం సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి, చౌటుప్పల్ తదితర పట్టణాలమీదుగా సాగుతుంది. 182 కి.మీ. పొడవైన దక్షిణ భాగాన్ని రూ.6480 కోట్లతో నిర్మించనున్నారు. ఇది చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి తదితర పట్టణాల మీదుగా సాగుతుంది.

వర్షపాతం కారణంగా అడుగంటిన జలాలు

# పొదుపుగా వాడుకుంటేనే మనుగడ: వివేక్

పెద్దపల్లి, తెలంగాణలో తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని.. అందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ సంవత్సరం 60శాతం వర్షాలు తక్కువ పడ్డాయని...అందుకే భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని చెప్పారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి.. ముంబై లాంటి నగరాల్లో కూడా నీటి కష్టాలు తప్పడం లేదని ఆయన చెప్పారు. గురువారం జిల్లాలోని ధర్మారం మండలం కమ్మరిఖాన్ పెట్ ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి,పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామ కృష్ణ రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా పని చేస్తామని చెప్పారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ బాగుండాలన్నారు. సంవత్సరం క్రితం ఆలయ అభివృద్ధి కోసం గౌడ కులస్తులు తనతో చర్చించారని... వాళ్లు తనను ఎప్పుడు మర్చిపోలేదన్నారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని.. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మనకు బాధలు వస్తే దేవుడిని మొక్కుతం, పూజలు చేస్తాం.. ఇలాంటి సాంస్కృతి ఏ దేశంలో లేదని అన్నారు. నాలుగేండ్లు మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డితో కలిసి ప్రజల కోసం పనిచేశామన్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అభివృద్ధి చేస్తామని వంశీకృష్ణ అన్నారు.

# నల్లగొండలో త్రిముఖ పోరు




నల్గొండ, నల్లగొండ పార్లమెంటుపై ప్రధాన రాజకీయ పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఆయా ప్రధాన పార్టీలు ముమ్మర కసరత్తు అనంతరం అభ్యర్థులను ప్రకటించాయి. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ గట్టి పట్టుదలతో ఉంది. గతంలో ఇక్కడి నుంచి ఉత్త్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట మినహా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జెండా పాతింది. ఈ క్రమంలో ఎలాగైనా కాంగ్రెస్‌ను ఢీకొని సత్తా చాటాలని కమలం, గులాబీ పార్టీలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఆయా పార్టీల అంతర్గత సమావేశాలతో అభ్యర్థులు తమ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. నల్గొండలో పాగా వేసేందుకు ప్రధాన పార్టీలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. గెలుపు కోసం అధికార, విపక్షాలు వ్యూహరచనల్లో మునిగి తేలుతున్నాయి.గతంలో మాదిరిగానే ఎంపి ఎన్నికల్లో అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత కలసి వస్తుందని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తమ సిట్టింగ్ పార్లమెంటు స్థానాన్ని నిలబెట్టుకునేందుకు హస్తం పార్టీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్ రెడ్డి నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో తండ్రి జానారెడ్డి, రఘువీర్ రెడ్డి సోదరుడైన నాగార్జునసాగర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్ రెడ్డి సైతం ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పార్లమెంటు పరిధిలోని సీనియర్లయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మిగతా ఎంఎల్ఎలంతా కలసి తన కుమారుడు రఘువీర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని జానారెడ్డి కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయా నియోజకవర్గాల పరిధిలో ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 5 లక్షల మెజార్టీ లక్షంగా పని చేయాలని సీనియర్ నాయకుడు జానారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 1952లో నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ ఏర్పాటు తర్వాత మొదట్లో కమ్యూనిస్టులు గెలవగా ఆ తరువాత ఓసారి టిడిపి, అనంతరం కాంగ్రెస్ అభ్యర్థుల హవా కొనసాగింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్ రెడ్డి 25 వేల 682 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఏడు సెగ్మెంట్‌లకు గాను బిఆర్ఎస్ నుండి ఆరుగురు ఎంఎల్ఎలు గెలవగా, కాంగ్రెస్ నుంచి ఉత్తమ్ ఒక్కరే గెలిచారు. అయినప్పటికీ ఎంఎల్ఎగా గెలిచిన ఉత్తమ్ నల్గొండ ఎంపిగా పోటీ చేసి విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెంగ్మెంట్‌లకుగాను ఆరు సెగ్మెంట్‌లలో ఎంఎల్ఎ గెలవగా, ఒక్క సెంగ్మెంట్‌లో మాత్రమే బిఆర్ఎస్ విజయం సాధించింది. ఇదిలా వుంటే బిజెపి సైతం సంప్రదాయానికి భిన్నంగా హుజూర్‌నగర్ బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ శానంపూడి సైదిరెడ్డికి పార్టీ కండువా కప్పి నల్గొండ ఎంపి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ అనూహ్య ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సైదిరెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో కాంగ్రెస్ సీనియర్ నేత, పిసిసి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి నల్గొండ ఎంపిగా ఎన్నియ్యారు. దీంతో ఆయన తన హుజూర్‌నగర్ ఎంఎల్ఎ సీటుకు రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికలో అదే పార్టీ నుంచి ఉత్తమ్ సతీమణి పద్మావతి రెడ్డిని బరిలో నిలిపారు. అయితే గులాబీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి దాదాపు 44 వేల మెజార్టీతో పద్మావతి రెడ్డిపై గెలుపొంది రికార్డు సృష్టించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా ఓటమి చెందిన శానంపూడి సైదిరెడ్డిని బిజెపిలోకి ఆహ్వానించిన మరుచటిరోజే ఆయనకు నల్గొండ ఎంపి టికెట్ ప్రకటించారు. అయితే పార్టీ పెద్దల జోక్యంతో సైదిరెడ్డి పార్టీలోని అందరు నేతలను కలుపుకొని వెళ్ళడమే కాకుండా నల్గొండ మేనిఫెస్టోను రూపొందించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన గులాబీ పార్టీకి కీలకమైన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముఖ్యమైన నాయకులందరూ ముఖం చాటేస్తున్నారు. కాగా, మాజీ ఎంఎల్ఎ కంచర్ల భూపాల్ రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల బరిలో దిగేందుకు ముందుకు వచ్చారు. అంతకుముందు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డి పోటీ చేస్తారని ప్రచారం జరిగినా సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆయన వెనక్కి తగ్గారు. తరువాత మాజీ ఎంఎల్‌సి తేరా చిన్నపరెడ్డి పేరు వినిపించినా లిక్కర్ కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అరెస్టు సహా ఇతర రాజకీయ పరిణామాలతో ఆయన ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ప్రస్తుతం తేరా చిన్నపరెడ్డి బిజెపి వైపు చూస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే కంచర్ల కృష్ణారెడ్డిని నల్గొండ ఎంపి అభ్యర్థిగా గులాబీ అధినేత కెసిఆర్ ప్రకటించారు. 2022లో మునుగోడు ఉప ఎన్నికలో, ఆ తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు టికెట్ కోసం కంచర్ల కృష్ణా రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అప్పటి రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయనకు టికెట్ దక్కలేదు. మొత్తానికి నల్గొండ పార్లమెంటు అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డిని ప్ర కటించడంతో ఇకపై ముఖ్య కార్యకర్తల సమావేశాలు సహా నియోజకవర్గాల వారీగా సభలు, సమావేశాలతో ముందుకెళ్ళాలని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి.

# కాంగ్రెస్‌కు తుక్కుగూడ సెంటిమెంట్ !

హైదరాబాద్,గత ఎన్నికల్లో విజయఢంకా మోగించిన కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ పట్టుకుంది. అదే తుక్కుగూడ. గత ఎన్నికల్లో తుక్కుగూడా నుంచే కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రకటించింది. ఆరు గ్యారెంటీలను సోనియాతో ప్రకటించారు. ఇది బాగా కలసి వచ్చింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ తెలంగాణలో అధికారం హస్తగతం చేసుకుంది. దివంగత వైఎస హయాంలో చేవెళ్ల సెంటిమెంట్ ఉండేది. ఆయన ఏ పనిచేసినా అక్కడినుంచే మొదలు పెట్టారు. చేవెళ్ల నుంచే పాదయాత్ర చేసి విజయం సాధించారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు తుక్కుగూడ బాగా కలసివచ్చింది. అందుకేనేమో మరోమారు పార్లమెంట్ ఎన్నికల ముందు ఇక్కడి నుంచే కాంగ్రెస్ ఎన్నికల సభ నిర్వహించింది. దేశ ముఖచిత్రాన్ని మార్చివేసే కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ మీద నుంచే ఎన్నికల శంఖారావం ఊదాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇక్కడే జాతీయస్థాయి మేనిఫెస్టో విడుదల చేయబోతున్నారు. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్.. నరేంద్ర మోదీ నేతృత్వంలోని పదేళ్ల ఎన్డీఏ పాలనకు చరమగీతం పాడాలనే కృతనిశ్చయం తో ఉంది. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన మేనిఫెస్టోను తెలంగాణ గడ్డమీద, అదీ శాసనసభ ఎన్నికలకు సమరశంఖం పూరించిన తుక్కుగూడ వేదికగానే విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ సెంటిమెట్‌ను బాగా నమ్ముకున్న కాంగ్రెస ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ధీమా తో ఉన్నారు. ఇదే జరిగితే తెలంగాణ కాంగ్రెస్‌కు కూడా కలసివచ్చే అంశంగానే చూడాలి. ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో 'జనజాతర' పేరిట నిర్వహించే భారీ బహిరంగ సభలో మేనిఫెస్టోతో పాటు తాము అధికారంలోకి వస్తే అమలు చేయనున్న అయిదు గ్యారంటీలను కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్రకటించనుంది. అందుకే సిఎం రేవంత్ సహా మంత్రులు తుక్కుగూడా ఏర్పాట్లపై దృష్టి సారించారు. తుక్కుగూడలోని 60 ఎకరాల విశాలమైన మైదానంలో జన జాతర బహిరంగ సభను కాంగ్రెస్ నిర్వహించనుంది. మైదానం పక్కనే వాహనాల పార్కింగ్‌కు సుమారు 300 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పాలనసాగిస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే కొన్ని పథకాలను కాంగ్రెస్ అమలు చేస్తోంది. అన్ని వర్గాలకు సంక్షేమం అందజేస్తూ ముందుకు సాగుతున్నట్లు చెబుతోంది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో జనజాతర సభకు ఆదిలాబాద్ మొదలు ఆలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు అన్నిగ్రామాలు, పట్టణాలు, నగరాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇప్పటికే తుక్కుగూడ జన జాతర సభ ప్రాంగణాన్నిసందర్శించి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాసనసభ ఎన్నికలకు తుక్కుగూడ నుంచే ఏ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ సమరశంఖం పూరించింది. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించింది. విజయభేరి వేదిక మీద నుంచే సోనియగాంధీ ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. ఆమె ప్రకటించిన ఆరు గ్యారెంటీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొలువుదీరిందని సెంటిమెంట్ గా భావిస్తున్నారు.



ఈ నేపథ్యంలో తమకు కలిసివచ్చిన తుక్కుగూడ నుంచే లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. తుక్కుగూడ వేదికగా నిర్వహించిన విజయభేరి సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నాడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని కుండబద్దలు కొట్టి చెప్పారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి ప్రజలంతా ఆహ్వానితులేనని ప్రకటించారు. అవే మాటలను ఆయన ఎన్నికల ప్రచారంలో పదే పదే పునరుద్ఘాటించారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. డిసెంబరు 9కి రెండు రోజులు ముందే ఏడో తేదీన రేవంత్ రెడ్డి సర్కార్ కొలువుదీరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తుక్కుగూడ వేదికగానే.. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో జూన్ 9 న ఎర్రకోటపై జెండా ఎగురవేస్తామని ప్రకటించనున్నట్లు సమాచారం. శాసనసభ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన ప్రతి మాట ప్రజల్లో బలమైన ముద్ర వేయడంతో పాటు నిజమవడంతో ఇప్పుడు ఆయన చేసే ప్రకటనలపై ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అందుకే తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ ఎన్నికల సమరశంఖం పూరించబోతోంది. ఇక్కడే దేశానికి పలు హామీలు ఇవ్వనుంది. మోడీ నాయకత్వంలో దేశం ఎలా దెబ్బతిన్నదీ వివరించబోతున్నది. కాంగ్రెస్ వస్తే ఏమేం మంచి పనులు చేస్తారో కూడా ప్రకటించబోతున్నది. మోడీని ఎందుకు దూరం పెట్టాలో కూడా వివరించబోతున్నది. కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంతవరకు ఈ ఎన్నికలు జీవనమరణ సమస్య లాంటివి. ఈ ఎన్నికల్లో ఓటమి పాలయితే ఇక మోడీని ఆపడం కష్టమే గాకుండా నిలవరించలేమని కాంగ్రెస్ పార్టీకి తెలుసు. అందుకే ఈ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ఇండియా కూటమి కలసి ప ఓటో చేస్తోంది. సీట్ల షేరింగ్‌లో కూడా కాంగ్రెస్ కొంత పట్టువిడుపులతో ముందుకు సాగుతోంది. రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే తుక్కుగూడను ప్రచారానికి ఎంచుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక తదితరలుఉ సమావేశానికి వస్తారు. దక్షిణాదిలో పట్టు సాధించాలని చూస్తున్న బిజెపికి లేదా మోడీకి చెక్క పెట్టేందుకే ఇక్కడ సభను నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉండివుంటుంది. మొత్తంగా తుక్కుగూడ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి.

# తారెత్తిస్తున్న ఎండలు..రాజకీయ నాయకులకు ముచ్చెమటలు

హైదరాబాద్,ఎండలు తారెత్తిస్తున్నాయి. ఎన్నికల సమయం కావడంతో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు కూడా భయపడుతున్నారు. ఈ ఎండాకాలం బయటపడేదెలా అని ఆలోచిస్తున్నారు. ప్రచారానికి వేకువ జామునే వెళుతున్నా మధ్యాహ్నం అయితే గానీ రరావడం కుదరడం లేదు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు మండు వేసవిని తలపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పగటి ఉ ష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి.

వడగాడ్పుల తీవ్రత పెరిగింది. మరో నాలుగు రోజల పాటు ఇదే విధమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని వాతవారణ శాఖ అధికారులు వెల్లడించారు. మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకూ చిన్న పిల్లలు , వృద్దులు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచిస్తున్నారు. వ్యవసాయ రంగంలో ప్రత్యేకించి ఆరుబయట పంట పొలాల్లో పనిచేసే రైతులు, రైతు కూలీ లు తగిన జాగ్రత్తలు తీసుకోవలని హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు వేడిగాలుల కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉం దని, వ్యవసాయ పనులు ఉదయం 11లోపు ముగించాలని, అదేవిధంగా తిరిగి సాయంత్రం మూడుతర్వాత కొనసాగించుకోవచ్చని సూచిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయిలో నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూర్‌లో అ త్యధికంగా 43.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైం ది. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన



వాతవరణం నెలకొంది. టీక్యాతాండా, ధరూర్‌లో 43.4, పెబ్బేర్‌లో 43.3, నాంపల్లిలో 43.2, కొరటపల్లి, బుగ్గబావిగూడ, తిరుమలగిరి కేంద్రాల్లో 43.1,వడ్డేపల్లిలో 43,కోనైపల్లి ,ఇబ్రహింపట్నం, 42.9డిగ్రీల చొప్పున ఉ ష్ణోగ్రతలు నమోద య్యాయి. తెలంగాణ రాష్ట్రంలో కింది స్థాయిలో గాలులు దక్షిణ , ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల నాలుగు రో జుల్లో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2నుండి 3డిగ్రీల వరకూ పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రాగల 24గంటల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని ,ఉష్ణోగ్రతలు గరిష్టంగా 39డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

# పెన్షన్లు ఆపించిన ఘనుడు బాబు



అమరావతి,చంద్రబాబు స్వార్థంతో ఏం చేస్తున్నారో అర్థం కావడంలేదని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆ స్వార్థంతోనే వాలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు కుట్రలు చేశారని మండిపడ్డారు. వాలంటీర్లపై నిమ్మగడ్డ రమేశ్‌తో ఫిర్యాదు చేయించారని పేర్కొన్నారు. వాలంటీర్లను తప్పించాలని లేఖ ఇప్పించింది ఆయనే అని పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ.. వాలంటీర్ల వ్యవస్థపై కుట్రతో చంద్రబాబుపై ప్రజల్లో వ్యతిరేకత ఇంకా పెరిగిపోయిందని విమర్శించారు. పెన్షన్ల విషయంలో తమపై ప్రజాగ్రహం వస్తుందని టీడీపీ గుర్తించిందని.. కానీ చంద్రబాబు ఎంత సంజాయిషీ ఇచ్చినా జనం నమ్మరని సజ్జల విమర్శించారు. గతంలో ఒకటో తేదీన వాలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో 80 శాతం పెన్షన్ పంపిణీ పూర్తయ్యేదని.. కానీ ఇప్పటివరకు 60 శాతం పెన్షన్ల పంపిణీ మాత్రమే జరిగిందని చెప్పారు. పైగా స్వయంగా వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు కష్టపడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో చంద్రబాబుపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో వాలంటీర్లకు మద్దతుగా మాట్లాడుతున్నారని చెప్పారు. చంద్రబాబుకు సమాజంలో ఉండే అర్హత లేదని విమర్శించారు. ఈసీపై ఒత్తిడి తీసుకొచ్చి పెన్షన్లు అడ్డుకున్నారని తెలిపారు. ప్రధాని సభ వైఫల్యాన్ని చంద్రబాబు, దగ్గుబాటి పురంధేశ్వరి రాష్ట్ర పోలీసులపై రుద్దే ప్రయత్నం చేశారని సజ్జల అన్నారు. 20 మంది ఎస్పీలపై పురంధేశ్వరి ఫిర్యాదు చేయడం దారుణమని అన్నారు. పవన్ పార్టీ ఎందుకు పార్టీ పెట్టారో అర్థం కావడం లేదు.. ఎన్నికల ముందే కూటమి దివాలీ తీసిందని విమర్శించారు. షర్మిల తెలంగాణలో ఎందుకు పార్టీ పెట్టారో తెలియదు.. ఏపీకి వచ్చి ఎందుకు పోటీ చేస్తున్నారో తెలియదు.

# ఏవోబీలో ఏపుగా గంజాయి



హైదరాబాద్, ప్రకృతి రమణీయతకు నెలవైన ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతంలో గంజాయి వాసన గుప్పుమంటున్నది. ఆ కంపు దేశంలోని అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తున్నది. దీంతో ఎంతో మంది యువత ఆ మత్తుకు బానిసలై చిత్తవుతున్నారు. ఉజ్వలమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ మత్తు మూలాలను కూకటివేళ్లతో పెకలించడంపై తెలంగాణ ఎక్సైజ్ శాఖ దృష్టి సారించింది. స్కూలు పిల్లలు తినే చాక్లెట్ల నుంచి పెద్దలు కాల్చే సిగరెట్ల వరకూ అన్నింటిలోనూ గంజాయి చొరబడటంతో ఇప్పటి నుంచే పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా త్వరలో అన్ని రాష్ట్రాల పోలీసు, ఎక్సైజ్ విభాగాలతో జట్టు కట్టాలని భావిస్తున్నది. ఏఓబీ నుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా గంజాయిని తరలించేందుకు కీలకంగా ఉన్న తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో స్మగ్లర్లపై ఎక్కడికక్కడ ఉక్కుపాదం మోపుతున్నది. దేశంలో 90% గంజాయి ఏవోబీలోనే ఉత్పత్తి అవుతుండటంతో దాన్ని కట్టడి చేయడంలో ఆంధ్రా, ఒడిశా అధికారుల సహకారాన్ని తీసుకునేందుకు తెలంగాణ అధికారులు సిద్ధమవుతున్నారు.

15 వేల ఎకరాల్లో గంజాయి సాగు

గంజాయి ఉత్పత్తికి ఏవోబీ కేరాఫ్‌గా మారడంతో సరిహద్దు రాష్ట్రాల పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఒక్క ప్రాంతంలోనే దాదాపు 10 వేల నుంచి 15 వేల ఎకరాల్లో గంజాయి సాగు అవుతున్నట్టు అంచనా. ఏవోబీలో గంజాయి సాగుకు భౌగోళిక, వాతావరణ పరిస్థితులు అనువుగా ఉండటంతోపాటు మావోయిస్టులు సంచరించే ప్రాంతం కావడంతో స్మగ్లర్లు ఆ ప్రాంతాన్నే తమ అడ్డాగా చేసుకుంటున్నారు. ఏవోబీలోని ప్రతి గ్రామంలో వరి, పసుపు, కంది, శనగ, మినప, పెసర పంటలకు తోడుగా గంజాయి మొక్కలను పెంచుతున్నారని, సాధారణ పంటల కంటే గంజాయి సాగు ఎంతో లాభసాటిగా ఉండటమే ఇందుకు కారణమని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు.

హాట్‌స్పాట్‌లుగా ఢిల్లీ, గుజరాత్

ఏఓబీ నుంచి తొలుత చింతూరు-భద్రాచలం మీదుగా తెలంగాణకు గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్లు.. ఇక్కడి నుంచి ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కేరళ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్, సికిం, నాగాలాండ్ తదితర రాష్ట్రాలకు అధికంగా గంజాయి రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్టు అధికారులు చెప్తున్నారు.అది రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఆదివాసీలు ఎక్కువగా నివసించే ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా దట్టమైన అడవులు, కొండలు, లోయలే. ప్రకృతి సౌందర్యానికి నెలవైన ఆ ప్రాంతం ఇప్పుడు గంజాయి ఉత్పత్తికి అడ్డాగా మారింది. దేశంలో 90% గంజాయి అక్కడే ఉత్పత్తి అవుతున్నది.

# రెండో విడతకు ముగిసిన నామినేషన్ల ఘట్టం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో రెండో విడతకు సంబంధించి 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల ఘట్టానికి గురువారంతో తెరపడింది. ఈ నెల 26న పోలింగ్ నిర్వహించనున్నారు. జమ్ముకాశ్మీర్ మినహా మిగిలిన అన్ని చోట్లా శుక్రవారం నాడు నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. జమ్ముకాశ్మీర్‌లో ఆదివారం చేపడుతారు.

కేరళ బరిలో 290 మంది

కేరళలోని వివిధ లోక్‌సభ నియోజకవర్గాల్లో 290 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 499 పేపర్లు వచ్చాయి. 8వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుండడంతో మొత్తం 20 నియోజకవర్గాల అభ్యర్థుల చిత్రం వెల్లడి కానుంది. తిరువనంతపురం- 22, అట్టింగల్- 14, కొల్లం- 15, పతనంతిట్ట- 10, మావేలికర- 14, అలప్పుజ- 14, కొట్టాయం- 17, ఇడుక్కి- 12, ఎర్నాకులం- 14, చాలకుడి- 13, త్రిసూర్- 15, అలతుర్కడ్- 15, వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థుల సంఖ్య 16, పొన్నాని- 20, మలప్పురం- 14, కోజికోడ్- 15, వాయనాడ్- 12, వడకరా- 14, కన్నూర్- 18, కాసరగోడ్- 13.తిరువనంతపురం నియోజకవర్గంలో అత్యధికంగా నామినేషన్ పత్రాలు అందాయి 22. అలత్తూరు కంటే తక్కువ 8. నామినేషన్ పత్రాల చివరి రోజైన గురువారం 252 నామినేషన్ పత్రాలు అందాయి.కాగా మహారాష్ట్రలోని 8 స్థానాలకు 352, బీహార్‌లో 5 స్థానాలకు 86, అస్సాంలో 5 స్థానాలకు 65, ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలకు 35, యుపిలో 8 స్థానాలకు 81 చొప్పున నామినేషన్లు దాఖలు అయినట్లు గురువారం సాయంత్రం ఎన్నికల అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర స్థానం



నుంచి సినీ నటి హేమమాలిని, కర్ణాటకలోని మాండ్య నుంచి హెచ్‌డి కుమారస్వామి, కేరళలోని త్రిసూర్ నుంచి సినీ నటుడు సురేష్ గోపి, వేనాడ్ నుంచి కె సురేంద్రన్, అలప్పుజ నుంచి కెసి వేణుగోపాల్ గురువారం నాడు నామినేషన్లు దాఖలు చేశారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి,తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్నిఘనంగా నిర్వహించారు. ఈనెల 9న ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించే ఆస్థానానికి ముందు వచ్చే ఆరో రోజు గురువారం తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన నిర్వహించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com